నవతెలంగాణ
మహబూబ్‌నగర్
1
బుధవారం 1 ఫిబ్రవరి 2023



సర్పంచులకు అండగా ఉంటా : మంత్రి శ్రీనివాస్ గౌడ్

నవ తెలంగాణ - మహబూబ్ నగర్

మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని గ్రామపంచాయతీ సర్పంచులకు అండగా ఉంటానని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడా, పర్యాటక, సాంస్కృతిక, వారసత్వ, యువజన సర్వీసుల శాఖల మంత్రి డా వీ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ లోని తన క్యాంపు కార్యాలయంలో మహబూబ్ నగర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హన్వాడ, మహబూబ్ నగర్ రూరల్, అర్బన్ మండలం పరిధిలోని పలు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల పనులపై చర్చించారు. అభివృద్ధి కార్యక్రమాల అమలు లో సర్పంచుల ఎదుర్కొంటున్న సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. సీఎం కేసీఆర్ గారు పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖల ద్వారా అమలు చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు.. ప్రజలకు చేరేలా సర్పంచులు బాధ్యత తీసుకోవాలని మంత్రి సందర్భంగా పిలుపునిచ్చారు.

మహబూబ్‌నగర్ కొత్త కలెక్టర్‌గా జి. రవి



నవతెలంగాణ- మహబూబ్ నగర్

మహబూబ్‌నగర్ జిల్లా కొత్త కలెక్టర్ గా జి రవినాయక్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. మంగళవారం సాయంకాలం ఐపీఎస్ ల బదిలీలు రాష్ట్ర ప్రభుత్వం చేసింది. ఇక్కడ పనిచేసిన వెంకట్రావు సూర్యాపేట జిల్లాకు బదిలీ కాగా జగిత్యాల జిల్లాలో పనిచేస్తున్న జి రవి మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ బదిలీ పై వచ్చారు.మహబూబ్ నగర్ జిల్లా కొత్త కలెక్టర్‌గా రవి నియామకం. ఇక్కడ పనిచేసిన కలెక్టర్ వెంకట్రావు సూర్యాపేట జిల్లాకు బదిలీగా వెళ్లారు.

ఆశావాహుల ప్రయత్నాలు ఫలించేనా ?

- కొందరు టికెట్ల కోసం మరికొందరు గెలుపే లక్ష్యంగా
- ప్రధానోపార్టీల వైపు మొగ్గు చూపుతున్న నాయకులు
- వేడెక్కుతున్న రాజకీయ వాతావరణం ?
- టీఆర్ఎస్, కాంగ్రెస్ వైపు యువకుల చూపు..



అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆశావాహులు తమ ప్రయత్నాలను మొదలుపెట్టారు. ప్రధాన పార్టీలోని కొంతమంది నాయకులు గెలుపు కోసం ప్రచారం ఉధృతం చేయగా మరి కొంత మంది వివిధ రాజకీయ పార్టీల నుంచి టికెట్ దక్కించుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.అధికార పార్టీ టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నుంచి పోటీ చేయడానికి ముందుకు వస్తున్నారు.

నవ తెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆశావాహులు తమ ప్రయత్నాలను మొదలుపెట్టారు. అధికార పార్టీ టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నుంచి పోటీ చేయ డానికి ముందుకు వస్తున్నారు. గద్వాల నియోజకవర్గంలోని అధికార పార్టీ తరపున స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మరోసారి పోటీలో నిలబడడానికి విస్తృత ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి డీసీసీ అధ్యక్షులు పటేల్ ప్రభాకర్ రెడ్డి ప్రచారం చేసుకుంటున్నారు.ఇదే నియోజకవర్గంలో నుంచి మాజీ మంత్రి డీకే అరుణ ఎమ్మెల్యేగా పోటీ చేస్తారని ప్రచారం ఉంది.ఇక్కడ త్రిముఖ పోటీ ఉండే అవకాశముంది.

అలంపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నుంచి కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి సంపత్ కుమార్ పోటీ చేయ నున్నారు.గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవంతో పాటు యువ నాయకుడిగా మంచి పేరుంది. టీఆర్ఎస్ నుంచి స్థానిక ఎమ్మెల్యే అబ్రహంతో పాటు మంద జగన్నాథంకుమారుడు శ్రీకాంత్ పోటీపడే అవకాశముంది. ఇక్కడ త్రిముఖ పోటీ ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఎక్కువగా విజయ అవకాశాలు కనిపిస్తున్నాయి.

వనపర్తి జిల్లా మొత్తం ఒకటే నియోజకవర్గంగా ఉంది. ఇక్కడ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి టీఆర్ఎస్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. నీళ్ల నిరంజన్ రెడ్డి అనే పేరు ఉంది. మొదటినుంచి నియోజకవర్గంలో విస్తతంగా పరిశీలిస్తూ సంక్షేమ పథకాలు అమలులో చిత్తశుద్ధితో పని చేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి చిన్నారెడ్డి ,కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు శివసేనారెడ్డి పోటీ పడు తున్నారు.బీజేపీ నుంచి మేఘారెడ్డి ,పలువురు ఈసారి వనపర్తి నుంచి పోటీ చేయాలనే పట్టుదలతో ఉన్నారు.

దేవరకద్ర నుంచి అధికార పార్టీ నుంచి ఎమ్మెల్యేఆల వెంకటేశ్వర్ రెడ్డి తలపడనున్నారు.డీసీసీ అధ్యక్షులు జి మధుసూదన్ రెడ్డి పోటీ చేసే అవకాశాలున్నాయి.బీజేపీ నుంచి పవన్ కుమార్ రెడ్డి రంగంలో ఉండే అవకాశాలున్నా యని సమాచారం.

నారాయణపేట నుంచి స్థానిక ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు శివకుమార్ రెడ్డి కుమారుడు పోటీ చేస్తారని ఊహాగానాలు వస్తున్నాయి. ఇక బీజేపీ నుంచి రతన్ పాండురంగారెడ్డి పోటీ పడతారని తెలుస్తుంది. మక్తల్ నుంచి ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి మరోసారి పోటీ చేస్తారు. కాంగ్రెస్ నుంచి శ్రీహరి, బీజేపీ నుంచి కొండయ్య పోటి చేసే అవకాశముంది.

జడ్చర్ల నుంచి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బరిలో ఉంటారు. అయితే ఇక్కడ నుండి మన్నె శ్రీనివాసరెడ్డి కుమారుడు జీవన్ రెడ్డి పోటీ పడతారని తెలుస్తోంది. కాంగ్రెస్ నుంచి అనిరుధ్ రెడ్డి ఎర్ర శేఖర్ విస్తృతంగా తిరుగుతున్నారు. షాద్‌నగర్ నుంచి ఎంపీ జితేందర్ రెడ్డి కుమారుడు నిధున్ రెడ్డి డీకే అరుణ కుమార్తె పోటీ పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. కల్వకుర్తి నుండి స్థానిక ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌తో పాటు సీనియర్ నాయకుడు బాలాజీ సింగ్ ఠాగూర్ ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి గోలి శ్రీనివాస్ రెడ్డిలు ఈసారి బరిలో ఉండాలని నియోజకవర్గం మొత్తం తిరుగు తున్నారు. ఇక కాంగ్రెస్ నుండి కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శితో వంశీ చందు రెడ్డి తోపాటు ఎన్నారై ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశిస్తున్నారు. ఇప్పటికే కల్వకుర్తి నియోజకవర్గంలో ఐక్యత ఫౌండేషన్ ద్వారా అనేక కార్యక్రమాలు చేపట్టారు. సుమారు 20 కోట్లు ఖర్చు చేసి సిసి రోడ్లు డ్రైనేజీలు పాఠశాలలకు తాగునీరు నిరుద్యోగులకు శిక్షణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఇదే నియోజకవర్గం నుంచి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఈసారి ఎన్నికల రంగంలో ఉండాలని విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. అచ్చంపేట నుంచి స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మరోసారి బరిలో ఉంటానని ధీమా వ్యక్తం చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షులు వంశీకృష్ణ ఇక్కడి నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేయనున్నారు. ముఖ్యంగా బీజేపీ నుంచి సతీష్ మాదిగ పోటీచేయాలని ప్రకటన చేయడంతో ఇక్కడ త్రిముఖ పోటీ ఏర్పడనున్నది. నాగర్ కర్నూల్ నుంచి స్థానిక ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి తోపాటు ఎమ్మెల్సీ కూచిపూడి దామోదర్ రెడ్డి కుమారుడు కూచిపూడి రాజేష్ రెడ్డి బరిలో ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. టికెట్ ఇవ్వకపోయినా తాను నమ్ముకున్న ప్రజల కోసం బరిలో ఉంటానని ఆయన విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఈసారి ఉమ్మడి జిల్లాలలో పోరు రసవత్తరంగా మారు తుంది. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది రాజకీయ వాతావరణం తారాస్థాయికి చేరుకుంటుంది. ముఖ్యంగా అధికారంలో ఉన్న టిఆర్ఎస్ కు ఉమ్మడి జిల్లాలో వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి.ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్‌కు అనేక చోట్ల గెలిచే అవకాశాలున్నాయి. ఇక కమ్యూనిస్టులు మాత్రం పోరాటాలే శరణ్యంగా ముందుకు వెళ్తున్నారు. ఎన్నికలు వచ్చినా రాకపోయినా ప్రజా సమస్యల ఎజెండాను చేసి ప్రభుత్వంతో పోరాడు తున్నామని తెలిపారు.

పట్టుబడ్డ పేలుడు పదార్థాలు



నవతెలంగాణ- జడ్చర్ల

జడ్చర్ల పట్టణంలో భారీగా పేలుడు పదార్థాలు లభ్య మయ్యాయి. పట్టణ నడిబొడ్డున ఒక గుడిసెలో గుట్టుచప్పుడు కాకుండా దాచిఉంచిన ఈ పేలుడు సామాగ్రిని విశ్వసనీయ సమా చారం ప్రకారం టాస్క్ ఫోర్స్, పోలీసులు సంయుక్తంగా మంగళ వారం రైడ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. సీఐ రమేష్ బాబు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో ఓ గుడిసెలో 2750 డిటోనేటర్లు,సుమారు 2000 జిలెటిన్ స్టిక్స్ ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు సంయుక్తంగాటాస్క్ ఫోర్స్ ,జడ్చర్ల పోలీసులు రైడ్ చేసి స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. రాజేష్ అనే వ్యక్తి ఈ పేలుడు పదార్థాలను వనపర్తి జిల్లా పెబ్బేరునుండి జడ్చర్ల కు తరలించినట్లు తెలిపారు. పెద్దపెద్ద రాళ్ళగుట్టలను పగులకొట్టడానికి తెచ్చిఉంచినట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు పేర్కొన్నారు. నిందితుడు రాజేష్ పరారీలో ఉన్నట్లు అతన్ని త్వరలోనే పట్టుకొని పూర్తిస్థాయి విచారణ చేసిన తర్వాతనే వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. కాగా జడ్చర్ల పట్టణం నడబొడ్డున ఇళ్ళమధ్యలో భారీగా పేలుడు పదార్థాలు దొరకడంతో జిల్లాలో సంచలనం సృష్టించింది. ఒకవైపు అభివృద్ధిలో పాలమూరు జిల్లాలో జడ్చర్ల దూసుకుపోతుంటే అంతే స్థాయిలో నేరాలు పెరుగుతుండడం కొంత ఆందోళన కలిగించే పరిస్థితి నెలకొంది.

'కోవిడ్ 'తో అనాథలైన పిల్లల భద్రతా ప్రభుత్వాన్నిది

మహబూబ్ నగర్ : కోవిడ్ కారణంగా తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిన పిల్లల ఆలనా, పాలన వారి భద్రత ప్రభుత్వం చూసుకుంటుందని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటరావు తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన కోవిడ్ కారణంగా తల్లిదండ్రులను కోల్పోయి ఒంటరిగా మిగిలిపోయి సంరక్షకుల సంరక్షణలో పెరుగుతున్న పిల్లలతో, వారి సంరక్షకులతో సమావేశమయ్యారు. కోవిడ్ మహమ్మారి కారణంగా జిల్లాలో సుమారు 14 మంది పిల్లలు వారి తల్లిదండ్రులను కోల్పోగా, ప్రభుత్వం వారికి ప్రతి నెల 4 వేల రూపాయలు చొప్పున స్పాన్సర్షిప్ ఇస్తున్నదని ,దాన్ని జాగ్రత్తగా వాడుకోవాలని ఆయన కోరారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, సి డబ్ల్యు సి చైర్మన్ నయిముద్దీన్, జిల్లా సంక్షేమ అధికారిని జరిన బేగం,బీఆర్‌బి కో ఆర్డినేటర్ వెంకటమ్మ సభ్యులు గన్నోజు చంద్రశేఖర్ ,చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి నర్మద, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

'మిషన్ భగీరథ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి '

మహబూబ్ నగర్ : మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాల్లో మిషన్ భగీరథ లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం ఫిబ్రవరి 6 తేదీన చలో అసెంబ్లీ నిర్వహిస్తున్నట్లు జేఏసీ నాయకులు ప్రకటించారు. మంగళవారం తెలంగాణ మిషన్ భగీరథ వర్కర్స్ యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో మిషన్ భగీరథ ఎస్సీ కార్యాలయం ముందు జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు, ఏఐటియుసి ,ఐఎఫ్టియూ సంఘాల నాయకులు నల్లవెల్లి కురుమూర్తి, మాకం రామ్మోహన్ ,శ్రీ వెంకటేష్ ,భుట్టో రాము ,శ్రీనివాస్ శెట్టి ,సుదర్శన్ గౌడ్ ,రాఘవేందర్ గౌడ్, హనుమంతు ,బలరాం ,సురేష్ తదితరులు మాట్లాడుతూ మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతనాలు 26,000 అమలుపరచాలని, పిఎఫ్ ఈఎస్ఐ, గ్రాట్యుటీ బోనస్ చెల్లించాలని తెలిపారు. మిషన్ భగీరథ స్కీమును మేఘ కంపెనీకి అప్పగించి ఘనంగా ఇంటింటికి నీళ్ల సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఒక్కో కంపెనీ ఒక్కోరకంగా 7500 నుంచి 10500 వరకు జీతాలు ఇస్తూ .కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని ఆరోపించారు.లైన్మెన్ లకు టీఏడీఏలు ఇవ్వకుండా నైట్ డ్యూటీ చేసే వారికి నైట్ అలవెన్స్ ఇవ్వకుండా ,లైటు బూట్లు ఇతర పరికరాలు అందించకుండా ఇవ్వకుండా ఇబ్బందుల గురిచేస్తూ కనీస వేతనాలు అడిగితే కక్ష సాధింపులకు పాల్పడుతున్న కంపెనీలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు

కంటివెలుగు ప్రారంభం

గండీడ్ : మండల పరిధిలోని మన్సూర్ పల్లి గ్రామంలో మంగళవారం జడ్పీటీసీ మాచారం శ్రీనివాస్ రెడ్డి రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన రెండో విడత కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు. గ్రామంలో 18 సంవత్సరాలు పైబడిన వారందరూ కంటి పరీక్షలు నిర్వహించుకొని ఉచితంగా మందులు, అవసరమైన వాళ్ళ కళ్ళద్దాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో రూపేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ కవిత, వైద్య సిబ్బంది,ఆశావర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

గండీడ్ : మండల కేంద్రంలో మంగళవారం మోర.కృష్ణయ్యపగిడ్యాల గ్రామానికి చెందిన అగేర్ల బాబు అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాయకుల ద్వారా వారి కుటుంబాలకు రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. అదేవిధంగా విషయం తెలుసుకున్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా.డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి తన బిఎంఆర్ ట్రస్ట్ ద్వారా బాధిత కుటుంబాలకు రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తమ్మలి రామచంద్రయ్య, రామచంద్రారెడ్డి, నగేష్, జనార్దన్ గౌడ్, కృష్ణ గౌడ్, కృష్ణారెడ్డి, రామ్ రెడ్డి, బోర్ కృష్ణ, బీఎంఆర్ సభ్యులు ఇజాజ్ పాషా, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములపై సమీక్ష

నవతెలంగాణ - బాలానగర్

మహబూబ్ నగర్ జిల్లాలో పోడు భూముల సమా వేశంలో రాజాపూర్ మండల జడ్పీటీసీ మోహన్ నాయక్ మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. పోడు భూమి కమిటీలో సభ్యులుగా ఉంటూ సమావేశానికి హాజరయ్యారు. పోడు భూముల సమస్య గురించి కలెక్టర్ తో సమావేశం జరిగింది. ఈ కమిటీ చైర్మన్ కలెక్టర్ ఉంటూ పోడు భూముల సమస్యల గురించి చర్చించారు. తక్షణమే మూడు భూముల పైన విచారణ జరపాలన్నారు.వారికి న్యాయం చేయాలని కలెక్టర్ కోరినట్లు రాజాపూర్ జడ్పీటీసీ మోహన్ నాయక్ అన్నారు.

మహేష్ కుటుంబానికి లక్ష ఆర్థిక సహాయం

నవ తెలంగాణ -మహబూబ్ నగర్

మహబూబ్‌నగర్ మండలం గాజులపేట గ్రామంలో ఇటీవలే ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబ సభ్యులకు రూ. 1,00,000/- చెక్కు అందించి నట్లు సగర సంఘం జిల్లా అధ్యక్షులు ప్రనిల్ చందర్ సగర తెలిపారు. మంగళవారం దేవరకద్రలి నియోజక వర్గం, గాజులపేట గ్రామ వాస్తవ్యులు కీ.శే దొడ్డన్న మహేష్ సగర ఇటీవల ప్రమధవశాత్తు మరణించారని వారు తెలిపారు. వీరు కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర సగర సంఘం, సగర బంధువులను ఆపత్కాలంలో ఆదుకోవాలి అనే ఉద్దేశంతోలి తలపెట్టిన కులగణ మరియు ఇన్సూరెన్స్ కార్యక్రమంలో వారి పేరు నమోదు ఉన్నట్లు వారు తెలిపారు. తద్వారా తెలంగాణ రాష్ట్ర సగర సంఘం నుంచి వచ్చిన రూ. 1,00,000/- చెక్కును చనిపోయిన వారి కుటుంబీకులకు పాలమూరు జిల్లా అధ్యక్షులు ప్రణీల్ చందర్, ప్రధాన కార్యదర్శి సత్యం సగర,స్థానిక సర్పంచ్ చంద్రశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రేమ్ సగర, టీజేపీ రాష్ట్ర నాయకులు దేవరకద్ర బాలన్న అందచేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ప్రణీల్ చందర్ ,పాలమూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు పద్మావతి సగర, ప్రధాన కార్యదర్శి అలివేలు సగర, రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు చంద్రమోహన్,జిల్లా యువజన అధ్యక్షుడు తరుణ్ సాగర,కోశాధికారి శ్రీధర్,జిల్లా సలహాదారులు న్యాయవాది హనుమంత్ సాగర్,రవీందర్ సాగర్,గ్రామ సగర సంఘం అధ్యక్షులు రొట్టె నరసింహ, బంగారు తిరుపతయ్య బాదురు జంగప్ప, ఆంజనేయులు సాగర్, మొగులయ్య సాగర్, మొగులయ్య సాగర్, రాఘవేంద్ర సాగర్, రవి సగర, గోవర్ధన్ సాగర్, హనుమంత్ సగర, మహానంద్ సాగర్, సత్యం పాల్గొన్నారు.

' అర్హులైన వారికి పోడు భూముల పట్టాలిస్తా '

నవ తెలంగాణ - మహబూబ్ నగర్

జిల్లాలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన వారికి పోడు భూముల పట్టాలను ఇవ్వటం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటరావు తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పోడు భూముల పై నిర్వహించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో పోడు భూముల పట్టాలకు వచ్చిన దరఖాస్తులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులతో కలిసి అన్ని దరఖాస్తులను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉన్న దరఖాస్తుల దారులకు పోడు భూముల పట్టాలు ఇవ్వటం జరుగుతుందని వెల్లడించారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, రెవెన్యూ అధనపు కలెక్టర్ కె .సీతారామారావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారిని చత్రునాయక్, డిఎఫ్ఓ సత్యనారాయణ, ఆర్డీఓ అనిల్ కుమార్, హన్వాడ జెడ్పీటీసీ విజయనిర్మల, రాజాపూర్ జెడ్పిటిసి మోహన్ నాయక్, తదితరులు హాజరయ్యారు.

కరాటే పోటీలకు విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ- మహబూబ్ నగర్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వేదికగా వైజాగ్ లో ఫిబ్రవరి 9 నుంచి 12వ తేదీ వరకు జరుగుతున్న అంతర్జాతీయ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలకు కింగ్ చోటో ఖాన్ కరాటే అకాడమీలో మాస్టర్ జహంగీర్ పాషా ఖాద్రి తో శిక్షణ పొందు తున్న ఆలనూర్ స్కూల్ విద్యార్థులు మహమ్మద్ సాబీర్ పాషా, షేక్ అర్సలన్, మరియా బేగం ఎంపికైనట్లు మాస్టర్ జాంగిర్ ఖాద్రి తెలిపారు. మంగళవారం ఆ విద్యార్థులకు సన్మానించారు. ముఖ్యఅతిథి జిల్లా డీఎస్పీ టి మహేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి గుర్తింపు తేవాలన్నారు. చదువుతోపాటు కరాటే లో శిక్షణ పొందాలని కరాటే నేర్చుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు.ముఖ్యంగా బాలికలకు ఆత్మ రక్షణ కోసం కరాటే విద్య అవసరమన్నారు. శిక్షణ మాస్టర్ జాంగిర్ పాషా ఖాద్రిని అభినందించారు. కరాటే శిక్షకులు జహంగీర్ పాషా ఖాద్రీ మాట్లా డుతూ ఈ అంతర్జాతీయ టోర్నమెంట్లో 8 దేశాల నుంచి శ్రీలంక,బంగ్లాదేశ్, నేపాల్, సౌదీ అరేబియా, భూటాన్, ఉగాండా, ఒమన్‌ల నుండి క్రీడాకారులు పాల్గొంటున్నట్టు తెలిపారు ఈ కార్యక్రమంలో చిన్న వీరయ్య , ప్రిన్సిపాల్ నజియా సుల్తానా, స్కూల్ డైరెక్టర్ ఖాజా బాషా, కరస్పాండెంట్ మహమ్మద్ అబ్దుల్ ఆహాద్ సిద్ధిక్ , ఉజఎఫ్ షరీఫ్, నేహా ఫాతిమా తదితరులు పాల్గొన్నారు

ఎల్‌ఓసీ అందజేత

గండీడ్ :మండల పరిధిలోని రెడ్డి పల్లి గ్రామానికి చెందిన జోగు.చెన్నయ్య వైద్య ఖర్చు నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించి వారి కుటుంబ సభ్యులకు 5లక్షల (5,00,000/-) రూపాయల ఎల్ఓసి చెక్కును ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిగి సింగిల్ విండో వైస్ చైర్మన్ భాస్కర్,కులకచెర్ల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు రాజు, రెడ్డిపల్లి గ్రామ బోడి వెంకటయ్య, బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు రఘురాం రెడ్డి, మాధవరెడ్డి, కృష్ణయ్య, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు అవగాహన సదస్సు

బాలానగర్ : బాలానగర్ మండల కేంద్రంలో మంగళవారం సంత బజారులో భారత్ పెట్రోల్ పంప్ ఆవరణలో పోలీసులు వాహనదారులకు అవగాహన సదస్సు కల్పించారు. మద్యం సేవించి కోరి ప్రమాదం తెచ్చుకోకండి లైసెన్స్ లేని వారికి వాహ నాలు ఇవ్వకండి జడ్చర్ల రూరల్లా జంబులప్ప బాలానగర్ ఎస్ఐ జయ ప్రకాష్ రాజాపూర్ ఎస్సై వెంకట్ రెడ్డి మిడ్జిలు ఎస్సై పలువురు పాల్గొన్నారు. కొన్ని వాహనాలను సీజ్ చేసినట్లు సిఐ జమ్ములప్ప తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులందజేత

రాజాపూర్ : రాజాపూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్దిదారులకు ఎంపీపీ సుశీల రమేష్, జడ్పీటీసీ మోహన్ నాయక్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మేకల శ్రీశైలం యాదవ్ లబ్ది దారులకు సీఎం సహాయనిధి చెక్కు లను అందజేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్య దర్శి వనపర్తి నరహరి, మండల ఉపాధ్యక్షులు రాచమల్ల యాదగిరి, ఎంపీడీవో లక్ష్మీదేవి, ఖానాపూర్ శేఖర్, ఖానాపూర్ సాయిరాం, ఖానాపూర్ లింగం, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : సర్పంచ్

నవ తెలంగాణ - మిడ్జిల్

పేదల సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యమని అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందడమే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్షమని సర్పంచ్ నిరంజన్ తెలిపారు .మంగళవారం మండలంలోని రాణి పేట గ్రామం చెందిన ఎల్లమ్మకు సీఎంఆర్ 20 వేల రూపాయల చెక్కును అందజేశారు. గతంలో ఉన్న ప్రభుత్వాలు ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఏ ప్రభుత్వం కూడా పట్టించుకోలేదని ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంటికి పెద్దది కులాగా ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి ఎంతో కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. ప్రజల కష్టాలు తెలుసుకొని ప్రజల కోసం పనిచేసే నాయకులను ప్రజలు గుర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్ ఎంపీపీ కాంతమ్మ రాజీనామా

- అభివృద్ధి నిధులు లేవు ... అవమాన పదవి
- కలెక్టర్ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్న అధికారులు



నవ తెలంగాణ- మహబూబ్ నగర్

ఒక పార్టీ నుండి గెలిచి.. ఎంపీపీ పదవిని చేపట్టి.. ఆ తర్వాత అధికార పార్టీలో చేరి.. ఆపై తిరిగి సొంత గూటికి చేరిన మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గం మిడ్జిల్ మండల పరిషత్ అధ్యక్షురాలు కాంతమ్మ మంగళవారం తన పదవికి రాజీనామా చేశారు. మిడ్జిల్ మండలంలో మొత్తం తొమ్మిది ఎంపీటీసీ స్థానాలకు గాను, నాలుగు కాంగ్రెస్, నాలుగు బీఆర్ఎస్, ఒక స్థానంలో కాంగ్రెస్ సహకారంతో స్వతంత్ర అభ్యర్థితో 2019 జూన్ లో ఎంపీపీ పల్లవి చేపట్టింది ఆమె. ఎస్సీ జనరల్ కు రిజర్వ్ చేసిన ఎంపీపీ స్థానాన్ని స్వతంత్ర ఎంపీటీసీకి వైస్ ఎంపీపీ పదవిని ఇచ్చి, ఎంపీపీ స్థానాన్నికైవసం చేసుకుంది. ఎంపీపీగా కాంతమ్మ బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో మండలం అభివృద్ధి చెందాలంటే ఒక్క ఏడాదిలోపే అధికార పార్టీలో చేరాలని సన్నిహితుల ఒత్తిడి రావడంతో ఆమె బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తనకు అధికార పార్టీలో సరైన ప్రాధ్యాన్యత లేదని ఆరోపణలు చేస్తూ ఐదు నెలల క్రితం తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరింది. మళ్లీ ఏం సమస్యలు తలెత్తయో కానీ కాంతమ్మ జిల్లా పరిషత్ కార్యాలయానికి చేరుకొని తన రాజీనామా పత్రాన్ని జిల్లా పరిషత్ సీఈఓకు అందజేశారు. ఎంపీపీ రాజీనామా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై జిల్లా సిఈఓ జ్యోతిని ఫోన్ ద్వారా వివరణ కోరగా తన పదవికి రాజీనామా చేసింది నిజమేనని... ఈ విషయంపై తాను జిల్లా కలెక్టర్కు ఫైల్ పెట్టామని నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నామని తెలిపింది..

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి : బీఆర్ఎస్

నవ తెలంగాణ, -జడ్చర్ల టౌన్

ఫిబ్రవరి 3, న జడ్చర్ల ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి గారి జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు బాదేపల్లి వ్యవసాయం మార్కెట్లో ఏర్పాటు చేయడం జరుగుతుందని దీనికి అందరూ సహకరించాలని జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని అన్నివార్డుల తో పాటు నియోజకవర్గ మండలాల నుంచి ప్రతి గ్రామం నుండి 20 మంది చొప్పున రక్తదానం చేయాలని తెలిపారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం అధిక సంఖ్యలో రక్తదానం చేయాలని కార్యకర్తలకు, ప్రజలకు పిలుపునిచ్చారు. కాబట్టి రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని అత్యవసర పరిస్థితిలో రక్తం కావలసిన వారికి ఈ యొక్క రక్తదాన శిబిరం నుంచి సేకరించిన రక్తం ఉపయోగపడుతుంది, కాబట్టి రక్త దానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారిని



ఆదుకోవడమే కాకుండా గవర్నమెంట్ హాస్పిటల్ లో అత్యవసర పరిస్థితులలో రక్తం లేక పేదవారుఇబ్బంది పడుతున్నారు. వారికి ఈ యొక్క రక్తదాన శిబిరం ద్వారా సేకరించిన రక్తాన్ని వారికి అందుబాటులో ఉంచుతారు, కాబట్టి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి జన్మదిన సందర్భంగా అధిక సంఖ్యలో వచ్చి రక్తదానాన్ని చేయవలసిందిగా జడ్చర్ల టీఆర్ఎస్ పార్టీ తరపున కోరారు. మహబూబ్‌నగర్ జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ నటరాజ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి గారి పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుంది. 2018 వ సంవత్సరంలో రాష్ట్రంలో అధికంగా రక్త దానం చేసిన శిబిరం మన డాక్టర్ లక్ష్మారెడ్డి గారి జన్మదినంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 2398 మంది రక్తదానం చేసి రికార్డును సృష్టించారు, ఫిబ్రవరి 3వ తారీఖున నిర్వహించే రక్తదాన శిబిరం ఇంకా ఎక్కువమంది రక్తం ఇచ్చేటట్లుగా చూడాలన్నారు, యొక్క రక్తదాన శిబిరం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం వరకు ఉంటుందన్నారు, అధిక సంఖ్యలో రక్తదానం చేసి అత్యవసర పరిస్థితిలో ఉన్న ప్రాణాలను కాపాడాలని కోరారు. ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కోడుగల్ యాదయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ దోరేపల్లి లక్ష్మి, రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రనిల్ చందర్, మూడ డైరెక్టర్ శ్రీకాంత్, ఇమ్ము, బిఆర్ఎస్ నాయకులు రఘుపతి రెడ్డి, పిట్టల మురళి, పరమటయ్య, గిరి యాదవ్, శంకర్ నాయక్, రామ్మోహన్, లు పాల్గొన్నారు.

యువత సమాజానికి ఒక మైలురాయి కావాలి

- అప్పుడే మానవ సమాజానికి సార్థకత
- ధైర్యం కోల్పోతే మరణంతో సమానం
- ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్



నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

యువత సమాజానికి ఒక మైలురాయి కావాలి. అప్పుడే మానవ సమాజానికి సార్థకత. ధైర్యం కోల్పోతే మరణంతో సమానం. ఆర్థిక పరిపుష్టిత సాధించడానికి మనం ఉద్యోగంలోకి వెళుతున్నామని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ అన్నారు. హైదరాబాదులోని బీఎంఆర్ కోచింగ్ వారు నిర్వహిస్తున్న పోలీస్ శిక్షణ అకాడమీలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రత్యర్థుల వత్తిడి వల్లే మనిషి ఎదుగుదల ప్రారంభమవుతుందని ఆయన గుర్తు చేశారు. యాంత్రికంగా ఉండే పుస్తకాలను కాదు మానవ సమాజాన్ని యువత అధ్యయనం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నేటికీ మనదేశంలో నూటికి 82 మంది బీపీఎల్ కు దిగువన బతుకుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చదువు ద్వారా విజ్ఞానం సంపాదించి మానసిక వికాసంతోపాటు కుటుంబ పోషణ మెరుగ్గా ఉండడానికి కృషి చేయాలన్నారు. రామాపాయం స్థితిలో ధైర్యం గొప్పది.ధైర్యం కోల్పోతే మరణంతో సమానమన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా స్వతంత్రంగా బరిలోకి దిగి జెడ్పీటీసీగా రాష్ట్రంలోనే రెండో స్థానం సాధించానని ఆయన తెలిపారు. ఐదు ఆరువేల మందిని ఉచితంగా చదువు చెప్పించడమే గాక వెయ్యి మందికి పైగా నిరుపేదలకు ఇండ్లు నిర్మించి ఇచ్చానని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ విజయ్ కుమార్, కోచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీపీ పదవికి కాదు ఎంపీటీసీ పదవికి కి రాజీనామా చేయాలి: కాంగ్రెస్

నవ తెలంగాణ- మిడ్జిల్

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కష్టపడి ఐదు మంది ఎంపీటీసీలను గెలిపించుకొని ఎస్సీ జర్నల్ అయిన ఎస్సీ మహిళను కాంగ్రెస్ పార్టీ ఎంపీపీ చేస్తే, అధికారంలో ఉన్నామని డబ్బులు కాంట్రాక్టులు పనులు ఇస్తామని మాయ మాటలు చెప్పి ఎంపీపీ పదవికి రాజీనామా చేయించడం ఏమిటని, టిఆర్ఎస్ నాయకులకు దమ్ముంటే ఎంపీటీసీకి పదవికి రాజీనామా చేసి ఎన్నికలలో గెలిపించుకొని ఎంపీపీ పదవి చేపట్టాలని దొడ్డిదారిన అమాయకత్వాన్ని, దళిత మహిళను, చూసి రాజీ



నామా చేయించడం అధికార పార్టీ నాయకులకు సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అల్వాల్ రెడ్డి,మిడ్జిల్ ఎంపీటీసీ సభ్యులు మహ్మద్ గౌస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వేముల సర్పంచి జంగయ్య, మాజీ సర్పంచులు వెంకటేష్ గౌడ్, నరసింహులుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మిడ్జిల్ మండలంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని అధికార పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీని బలహీనం చేయడానికి కుట్రలు కుతంత్రాలు పాల్పడిన ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కూడా టిఆర్ఎస్ పార్టీ కి వెళ్లలేదని తెలిపారు. అధికారం బలం ఉందని డబ్బులతో విర్రవీగితే వచ్చే ఎన్నికలలో అధికార పార్టీకి ఓటు ద్వారా ప్రజల బుద్ధి చెబుతారని తెలిపారు. విలేకరుల సమావేశంలో హరి గౌడు,బంగారు ,బాలు, పర్వతాలు, తదితరులు పాల్గొన్నారు.



'నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయాలి'

పెబ్బేరు : వ్యవసాయానికి నిరంతరంగా విద్యుత్‌ను అందించాలని కోరుతూ రైతుల పక్షాన మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం సబ్‌స్టేషన్‌ను ముట్టడించి ధర్నా నిర్వహించారు. అనంతరం మండల అధ్యక్షుడు విజయ్‌వర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కనీసం 12 గంటల పాటు పగటిపూట విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఈ కవితకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వెంకట్రాములు, జిల్లా యూత్ నాయకులు రంజిత్ కుమార్, మాజీ సర్పంచ్‌లు సురేందర్ గౌడ్, నరేంధర్, కౌన్సిలర్ సత్యనారాయణ, జిల్లా ఎస్సీ సెల్ నాయకులు సర్వేశ్, టౌన్ ఉపాధ్యక్షుడు సునీల్ కుమార్, రజక నరసింహ, హాత్ సే హాత్ జోడో ఇన్‌చార్జి రణధీర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు వీరస్వామి, మండల సీనియర్ నాయకులు, హరిబాబు, నరసింహ నాయుడు, మన్యం, రాములు, భాను, గంధం అంజి, జహంగీర్, యూత్ నాయకులు వినయ్, రాజా గౌడ్, హేమంత్ రెడ్డి,మాలపల్లి శివ,పాతపల్లి అనిల్ ,చందు, పరుశరముడు, కృష్ణయ్య సాగర్, కాసిమ్, శ్రీను పాల్గొన్నారు.

నేటి ధర్నాను జయప్రదం చేయండి

ఆత్మకూర్ : భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ప్రగతి శీల భవన నిర్మాణ కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా నిర్వహిస్తున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ ,కార్యదర్శి సీ రాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు పెంచాలని , మేస్త్రీలకు మోటార్ సైకిల్ ఇవ్వాలని , 60 సంవత్సరాలు దాటిన వారికి రూ.6 వేల పింఛన్ ఇవ్వాలని తదితర సమస్యలపై ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

లబ్ధిదారులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

- జిల్లా కన్వీనర్ పుట్ట ఆంజనేయులు

నవ తెలంగాణ - వనపర్తి

జిల్లా కేంద్రంలోని 18వ వార్డులో ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, స్థలం ఉన్నవారికి ఐదు లక్షలు ఇంటి నిర్మాణానికి నిధులు ఇవ్వాలని తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక జిల్లా కన్వీనర్ కుండా ఆంజనేయులు కోరారు. మంగళవారం ప్రజా సంఘాల పోరాట వేదిక నాయకులు 18వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లా డుతూ గతంలో ఇండ్ల స్థలాల పట్టాలు ఇచ్చిన 685 మందికి స్థలాలు చూపాలని డిమాండ్ చేశారు. స్థలాల విషయమై మంగళవారం సర్వే నిర్వహించినట్లు తెలిపారు. సర్వే నెంబరు 974లో పీర్లగుట్ట, మబ్బుగుట్ట, అప్పాయపల్లి శివారులోన 143, 145 సర్వే నెంబర్లలో 685 మందికి పట్టాలు 2008 అక్టోబర్లో ఇచ్చినప్పటికీ నేటికీ స్థలాలు చూపలేదని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఫిబ్రవరి 3న వనపర్తితహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు.

ప్రజ లు వ్యక్తిగత దరఖాస్తులతో ధర్నాకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక నాయకులు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గంధం మదన్, నాయకులు సీపుల్లయ్య, డీ. బాలరాజు, ఎం. మన్యంలతో పాటు తదితరులు పాలొ్గన్నపాల్గొన్నారు.



విజేతలకు బహుమతుల ప్రదానం

నవతెలంగాణ - వనపర్తి

ఇంగ్లీష్‌లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ వనపర్తి ఆధ్వర్యంలో జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్ వనపర్తి నందు నిర్వహి ంచిన జిల్లా స్థాయి స్టోరీ టెల్లింగ్, స్పెల్ విజార్డ్ కాంపి టీషన్‌లో విజేతలకు విద్యాశాఖ జిల్లా అధికారి ఏ రవీందర్ బహుమతులను ప్రదానం చేశారు. ఇంగ్లీష్ అంతర్జాతీయ భాష అని ప్రతిఒక్కరూ ఇంగ్లీష్ నేర్చుకొని అభివృద్ధి పథంలో కొనసా గాలని కోరారు.విద్యార్థుల ప్రతిభను ఆయన కొని యాడారు. ఇంగ్లీష్ టీచర్లను అభినందించారు. జిల్లా స్థాయి విజేతలు వచ్చే నెలలో హైదరాబాదులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు. స్టోరీ టెల్లింగ్ విజేతలు మొదటి బహుమతి చంద్రిక, జెడ్పీహె చ్ఎస్ పెద్దమందడి, రెండో బహుమతి భవిత,కేజీబీవీ అమరచింత. అదేవిధంగా స్పెల్ విజార్డ్ ప్రథమ బహుమతి సాయి ప్రియ జెడ్ పి హెచ్ ఎస్ పెబ్బేర్ ద్వితీయ బహుమతి భారతి, బలిజపల్లి. కార్యక్రమం విజయవంతానికి



సహక రించిన ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసి యేషన్ జిల్లా అ ధ్యక్షుడు సూర్య విష్ణువర్ధన్, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు వర్ధన్‌లు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్ర మం లో వనపర్తి జిల్లాఏఎంఓ మహానంది, సెక్టోరియల్ ఆఫీసర్ యుగం ధర్, మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్, బాలి కోన్నత పాఠశాల జీహెచ్ఎం తారాబాయి, ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ నాగరాజు,రాజు సరస్వతి,గోపాల్, రాంబాబు, విజయ, పరం దాములు, వరప్రసాద్‌గౌడ్, నరసింహగౌడ్ పాల్గొన్నారు.

మౌనదీక్షకు అనుమతివ్వాలి తహసీల్దార్‌కు వినతి



ఆత్మకూర్ : పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనున్న మౌన దీక్షకు అనుమతి ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు బుధవారం హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద మౌనదీక్ష,గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయాల దగ్గర మౌనదీక్షల కార్యక్ర మానికి పోవుట నిమిత్తం తహసీల్దార్ సింధుజకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు గోవిందు, మాజీ అధ్యక్షులు శ్రీనివా సులు, కే శ్రీనివాసులు, కురుమన్నలక్ష్మి, పరుశురాం పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

ఆత్మకూరు : పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం సెక్టార్ పరిధి లోని అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ నిర్వహించినట్లు సీడీపీఓ భారతి పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ రిపోర్టులను తీసుకున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి నెలకు సంబంధించిన ప్రీస్కూల్ రోల్ ప్లేను టీచర్లకు శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు . కార్యక్రమంలో సూపర్ వైజర్లు, సెక్టర్లోని అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



అంధత్వ నివారణకు 'కంటివెలుగు'

- చైర్‌పర్సన్ ఎద్దుల కరుణశ్రీసాయి

పెబ్బేరు : అంధత్వ నివారణకు కంటివెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎద్దుల కరుణ శ్రీ సాయి అన్నారు. మంగళవారం పెబ్బేరు పురపాలకకేంద్రంలో మూడో వార్డులోని ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో కంటివెలుగు కార్యక్రమాన్ని కౌన్సిలర్ పార్వతి మహేందర్ గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉచిత కంటివెలుగు కార్యక్రమాన్ని కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పార్వతి మహేందర్ గౌడ్, సువర్ణ వెంకట్రాములు, సుమతి ఎల్లయ్య యాదవ్, మేనే జర్ గణేష్ బాబు, శానిటరీ ఇన్స్పెక్టర్ ఉమా మహేశ్వర్ రెడ్డి, అక్కల జ్యోతి మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.



పెబ్బేరులో..

ముగిసిన 'కంటి వెలుగు'

కంటి వెలుగు వైద్య సిబ్బందిని సర్పంచ్ అక్కల స్వాతి ప్రభాకర్ గౌడ్ సన్మానించారు.పెబ్బేరు మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో నిర్వహించిన రెండో విడుత కంటివెలుగు కార్యక్రమం మంగళవారం ముగిసింది. గ్రామంలో 1702 మందికిగాను 1656 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో దగ్గరచూపు ఉన్న 123 మందికి కంటి అద్దాలు అందించగా, దూరపు చూపు దగ్గర చూపు ఉన్న 181 మందికి కంటి అద్దాలు ఆర్డర్ చేసినట్లు వైద్యులు తెలిపారు. వీరికి వారము లోపు అద్దాలు అందించనున్నట్లు అలాగే కంటి ఆపరేషన్ కు 26 మంది ఉన్నారని స్థానిక వైద్య అధికారి డాక్టర్ రాకేష్‌రెడ్డి పేర్కొన్నారు. కంటివెలుగులో సేవలు అందించిన సిబ్బందిని శాలువాలతో సన్మానించినట్లు సర్పంచ్ అక్కి స్వాతి ప్రభాకర్‌గౌడ్ తెలిపారు. మండలంలోని బున్యధిపురంలో బుధవారం కంటి వెలుగు వైద్య శిబిరంఉంటుందని డాక్టర్ రాకేష్ రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మద్దిలేటి, కంటి వైద్య అధికారి డాక్టర్ సుధా రాణి, క్యాంప్ కోఆర్డినేటర్ వెంకట సుబ్బమ్మ, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, పంచాయతీ సెక్రటరీ రేణుక, శకుంతల, విజయ, ఆప్తమాలిక్ నాగరాజు, డాటా ఎంట్రీ ఆపరేటర్ నీహారిక, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'కంటి వెలుగు'

ఆత్మకూర్ : పట్టణంలోని రెండో వార్డులోని జాతర మైదానంలో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరం మంగళవారంతో నాలుగో రోజుకు చేరింది. ఇప్పటి వరకు 926 మంది కంటి పరీక్షలు చేయించుకున్నట్లు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సామ్రాజ్యలక్ష్మి ,డాక్టర్ శివ లీల, ఏఎన్ఎంలు అనిత, ఇందిరా, ఆశా కార్యకర్తలు భాగ్యలక్ష్మి, నవనీత, పుష్పలత, నర్సమ్మ , ఆకాంక్ష పాల్గొన్నారు.



పెబ్బేరులో..



ఆత్మకూరులో..

సమాజ సేవలో భాగస్వాములు కావాలి : కలెక్టర్



నవతెలంగాణ - వనపర్తి

సామాజిక సేవల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వనపర్తి జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష అన్నారు. వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత నమోదు గుర్తింపు కార్డులను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ కమిటీ వారు పంపిన గుర్తింపు కార్డులను కలెక్టర్ చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక సేవలో భాగస్వాములు కావాలని. సామాజిక సేవలో ముందుండాలన్నారు .ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వనపర్తి జిల్లా వైస్ చైర్మన్ సయ్యద్ కలాం పాషా జిల్లా కార్యదర్శి కృష్ణ సాగర్ జూనియర్ రెడ్ క్రాస్ జిల్లా కన్వీనర్ హైమద్ బిన్ ఉమర్ జిల్లా ఫైనాన్స్ కమిటీకన్వీనర్ గొనూరి యాదగిరి, ఫోటోగ్రాఫర్ కె జ్ఞానమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



పాన్‌గల్ : గ్రామపంచాయతీకి రావలసిన నిధులు వెంటనే విడుదల చేయాలని కోరుతూ పానగల్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, కార్యదర్శి వెంకటయ్యయాదవ్‌లు మండల కేంద్రానికి వచ్చిన కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్‌రెడ్డి,వెంకట యాదవ్‌లు మాట్లాడుతూ గత పది నెలల నుంచి గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం నుంచి రావలసిన నిధులు రావడం లేదన్నారు. చేపట్టిన పనులకు అప్పులు చేశాం.. పెండింగ్‌లో ఉన్న డబ్బులను విడుదల చే యాలని కోరారు. గ్రామ పంచాయతీలో గత రెండేళ్ల నుంచిప్రైవేట్ సంస్థకు ప్రభుత్వం గ్రామ పంచాయతీ నుంచి బల్బులు వేసే అధికారాన్ని అగ్రిమెంట్ ప్రైవేట్ సంస్థకు అప్పగించడంతో బల్బులు వేయడంలేదని సర్పంచులు వేయలేక పోతున్నామని వాపోయారు. ఈ విషయం పై ఎన్నోసార్లు కలెక్టర్‌కి ,జిల్లా పంచా యతీ అధికారి దృష్టికి తీసుకువచ్చినప్పటికి ఫలితం లేకపోయిందని తెలి పారు. గ్రామ పంచాయతీల పారిశుద్ధ కార్మికులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని వాపోయారు. ఇప్పటికైన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి స్పందించి బల్బులు వేసే అధికారాన్ని రెండు మూడు రోజుల్లో పరిష్కరిస్తానని, గ్రామ పంచాయతీకి రావలసిన నిధులు విష యాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తామని చెప్పినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చికేపలి సర్పంచ్ బాలస్వామి , తెల్ల రాళ్లపల్లి తండా సర్పంచ్ శాంతమ్మ , తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్య నాయక్ , వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్టాపన



పెబ్బేరు : మండలంలోని రంగాపూర్ గ్రామంలో వేంకటేశ్వర స్వామి, ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్టాపన పూజలు మూడోరోజు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు హెూమాలు నిర్వహించి పూజలు చేశారు.ఆలయచైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు వాసుదే వారెడ్డి,చంద్రశేఖర్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, మాధవరెడ్డి, రమేష్‌రెడ్డి, అధ్యక్ష తన వేద పండితుల ద్వారా 2 ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 8గంటల నుంచి వేదపారాయణం, చతుస్థానార్చన, క్షీరాధివాసం, సుదర్శన నారసింహ సహిత లక్ష్మి వెంకటేశ్వరహవనం, నిత్య పూర్ణాహుతి, కర్మాంగ స్నపనం, శాత్తుమైరై తీర్థగోష్టి మధ్యాహ్నం 2 గంటలకు గ్రామోత్సవం, సాయంత్రం 06-00 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం, చతుస్థానార్చన, ఆధివాస హెూమం,యంత్ర శక్యది, హెూమంలు, సత్యపూ ర్ణాహుతి శయ్యాధివాసం, చాయాధివాసం, శాత్తుమైరై తీర్థ ప్రసాద వితరణ చేశారు.సాయంత్రం 3గంటల నుంచి స్వామివారికి అభిషేకం నిర్వహిం చారు. గ్రామ వీధుల గుండా స్వామివారి విగ్రహాలను, ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

దక్కని స్లాట్ బుకింగ్..

ఆత్మకూరు : రాష్ట్ర వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా కేంద్రాలలో ప్రభుత్వ వైద్యశాలలు నిర్వహించే వికలాంగ పరీ నిమిత్తం ఆన్లైన్లో మీ సేవలో స్లాట్ బుకింగ్ ఏర్పాటు చేశారు. కొద్ది గంటల్లోనే స్లాట్ బుకింగ్ అయిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నటువంటి వికలాంగుల పెంఛన్ రూ.3,500 పెంచడంతో ప్రజలు ఎక్కువ సంఖ్యలో ఆత్రుతతో బుకింగ్ చేసుకుంటున్నారు. కేవలం కొన్ని గంటల్లో బుకింగ్ అయిపోయే సరికి నిరాశకు లోనవుతున్నారు. స్లాట్ బుకింగ్ లో అవకాశం దొరకక కొందరు కలెక్టర్ కార్యాలయానికి బారులు తీరారు. స్లాట్ బుకింగ్ సమయం ఎక్కువ పెంచాలని , పరీక్షించే వైద్యుల సంఖ్యపెంచి ఎక్కువ మందికి అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

ఘనంగా ఉర్సు ఉత్సవాలు



అమరచింత : హజరత్ హాజీమలాంగ్ బాబా ఉర్సు షరీఫ్ ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.సోమవారం అమరచింత మండలంలోని మస్తీపూర్ లోని గుట్టపైన రాత్రి నిర్వహించిన హజరత్ హాజీ మలాంగ్‌బాబా ఉర్సు షరీఫ్ ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అయూబ్ ఖాన్, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు అయూబ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ తోఫిక్, శక్తి యాప్ మండల అధ్యక్షుడు కేజీ మహేందర్ రెడ్డి, ఎస్సీసెల్ మండలఅధ్యక్షుడు శ్యామ్, పట్టణ ఉపాధ్యక్షుడు ప్రకాశం, బీసీసెల్ మండలఅధ్యక్షుడు విష్ణు, ఎస్టీ సెల్ మండల నాయకులు హనుమంతు నాయక్, నాగునాయక్ ,కృష్ణ నాయక్ పాల్గొన్నారు.

' మార్కెట్లో అవినీతిని అరికట్టాలి'



నవతెలంగాణ - వనపర్తి

వ్యవసాయ మార్కెట్లో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి నిరంజన్‌రెడ్డిని సీపీఎం నాయకులు కలిసి వనపర్తి వ్యవసాయ మార్కెట్లో జరుగుతున్న జీరో వ్యాపారాన్ని అరికట్టాలని వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ మార్కెట్ కు వచ్చిన రోజువారి పల్లిని బోర్డు పైన రాసి అదే విధంగా ఏ గ్రేడ్, బి గ్రేడ్ రేట్లను కూడా బోర్డు పైన రాసి మైక్ లో అనౌన్స్ చేయాలని నిబంధనలో ఉన్న పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలపై నెలరోజుల క్రితమే మార్కెట్‌ను సందర్శించి మార్కెట్ చైర్మన్, మార్కెట్ కార్యదర్శికి సమస్యలపై వినతి పత్రం అందజేసినట్లు వివరించారు. రైతులకు ఐదు రూపాయల భోజనం, తాగునీరు, విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలన్నారు.కొనుగోలు చేసిన ధాన్యానికి తక్ పట్టి ఇవ్వాల న్నారు. మార్కెట్లో అధికారులు ట్రేడర్స్ పాలకవర్గంతో రైతు సంఘాల జా యింట్ సమావేశం ఏర్పాటు చేయాలన్నారు.కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్, పట్టణ సీపీఎం నాయకులు పరమేశ్వరచారి పాల్గొన్నారు.

కొనసాగుతున్న పశువైద్య శిబిరాలు



పెబ్బేరు : పశువైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. మంగళవారం పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో పశు సంవర్ధక శాఖ సహకారంతో జాతీయ సేవా పథకం (ఉచిత పశు ఆరోగ్య శిబిరం) కార్యక్రమాన్ని పెబ్బేరు మండలంలోని జనుంపల్లి, పెంచికల్ పాడ్ , ఈర్లదిన్నె గ్రామాల్లో పశువైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచులు రాజవర్ధన్‌రెడ్డి ,గోవింద నాయుడు పద్మమ్మ , ఎంపీటీసీ సునీత రాధాకృష్ణ మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, గ్రామ రైతు బంధు అధ్యక్షుడు సత్యారెడ్డి హాజరై పశువైద్య శిబిరాన్ని ప్రారంభించారు. మొత్తం 489 పశువులకు ఉచిత ఆరోగ్య గర్భనిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు పశువైద్యాధికారి మాధవి తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్లు కే వెంకటేశ్వర్‌రెడ్డి, యూనివర్సిటీ ప్రొఫెసర్లు వెంకట రమణ, అనిల్, రవి, గోపాల కృష్ణ, స్రవంతి , తిరుపతి జయశ్రీ, మండల పశు వైద్యాధికారి మాధవి కుమార్, డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ రమేష్, డాక్టర్ మల్లేష్ ,డాక్టర్ ఉదయ్ కుమార్ రెడ్డి,డాక్టర్ శ్రీకర్ రెడ్డి, కొండన్న వెటర్నరీ అసిస్టెంట్ అసిస్టెంట్, కరుణాకర్ ఆఫీస్ సబర్డినేట్, రాఘవేంద్ర ఆఫీస్ సబర్డినేట్, మాధవయ్య ఆఫీస్ సబర్డినేట్,ట్రైనీ డాక్టర్స్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పింఛన్లు ఇవ్వండి.. మహాప్రభో..!

ఆత్మకూరు : ఆత్మకూరు పట్టణంతో పాటు వివిధ గ్రామాలలోని వికలాంగ, వృద్ధాప్య, వితంతు పింఛన్లు ఇవ్వాలని లబ్ధిదారులు కోరారు. మంగళవారం పట్టణంలోని పోస్టాఫీస్ వద్దకు లబ్ధిదారులు కాంతమ్మ, వెంకటన్న , మహమూద, షర్ఫుద్దీన్‌లు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతినెలఇచ్చే పింఛన్లు ఈ నెల దాటుతున్న ఇవ్వకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. వయసు మీద పడటంతో మందులకు ఖర్చులు కూడా ఇబ్బంది కరంగా మారిందని వాపోయారు.ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి ప్రతి నెల ఒకటో తేదీనా పింఛన్‌ను అందించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి



వనపర్తి : రెండు నెలల్లో కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి పేర్కొన్నారు. మంగళవాకం లక్ష్మీ నరసింహ కాలనీలో పర్యటించి కాలనీలో నెలకొన్న సమస్యలపై ఆరాతీశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం (ఐద్వా) వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వారం రోజుల క్రితం లక్ష్మీనరసింహ కాలనీలో నెలకొన్న సమస్యలపై సర్వే నిర్వహించి సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇందులో భాగంగా కాలనీలో పర్యటించినట్లు కమిషనర్ తెలిపారు. కాలనీలో జిల్లా సహాయ కార్యదర్శి డీ రేణుక, కాలనీ మహిళలలతో కలిసి రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలను పరిశీలించి పరిష్కరించనున్నట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. రెండు నెలల్లో కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో కాలనీవాసులను ఐక్యం చేసి ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని ఐద్వా జిల్లా కార్యదర్శి ఏ లక్ష్మీ హెచ్చరించారు.

ప్రభుత్వ పాఠశాలకు ఫర్నిచర్ వితరణ



నవతెలంగాణ - తెలకపల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 2002-2003 విద్య సంవత్సరానికి సంబంధించిన పూర్వ విద్యార్థులు తాము చదివిన పాఠశాలలో గ్రంథాలయ ఏర్పాటు కోసం రూ. 22 వేల విలువగల ఫర్నిచర్‌ను మంగళవారం వితరణ చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యా యులు డి బాలస్వామి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పూర్వ విద్యార్థులు, యువకులు తోడ్పాటు అందించడం ఎంతో ఆనందించదగిన విషయమని అన్నారు. పాఠశాలకు ఫర్నిచర్ వితరణ చేసిన దాత సురేందర్ రెడ్డిని, పూర్వ విద్యార్థులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులు సురేందర్ రెడ్డి, ఆంజనేయులు, సురేష్, రాముడు, ఓనమాల్ రెడ్డి, మల్లేష్, మధు, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమానికి కృషి

- ఎన్‌పీఆర్‌డీ ఇండియా జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్



నవతెలంగాణ- అచ్చంపేట రూరల్

వికలాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికీ పేరు పేరున ప్రత్యేక కృతజ్ఞతలు అని ఎన్‌పీఆర్‌డీ ఇండియా జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని 19వ వార్డులో వికలాంగుల కార్యాలయానికి స్థానిక కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శైలజ విష్ణువర్ధన్‌రెడ్డి సహకారంతో జీబీఆర్ ట్రస్ట్ నుంచి ప్రతినెల రూ.4 వేలు చొప్పున గత 2 సంవత్స రాలుగా చెల్లిస్తున్నారని అన్నారు.. ఈ కార్యాలయం వికలాంగులకు ఎంతో ఉపయోగకరమైనదని, సమస్యల పరిష్కారానికి సమావేశాల నిర్వహణకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

వాలీబాల్ విజేత నాగర్‌కర్నూల్ జిల్లా జట్టు



నవతెలంగాణ- కందనూలు

ఈనెల 29, 30లో ఉమ్మడి జిల్లాలోని అడ్డాకుల మండలం రాచాలలో చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా జిల్లా వాలీబాల్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి బాలికలు, బాలుర వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గద్వాల, నారాయణపేట, వనపర్తి, మహబూబ్న గర్, బాలబాలిక జట్టు పాల్గొన్నా ఈ పోటీలకు నాగర్‌కర్నూల్ జిల్లా బాలురు జట్టు పాల్గొని గద్వాల, నారాయణపేట్, వనపర్తి, మహబూబ్నగర్ బాలుర జట్టుపై మంచి ప్రతిభ కనబరిచి ఫైనల్లో విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. అనంతరం క్రీడాకారులనుదేశించి అధ్యక్షులు వంకేశ్వరం నిరంజన్ మాట్లాడుతూ.. ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించాలని అన్నారు.

దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ అందజేత



నవ తెలంగాణ- కందనూలు

ఆప్పిలెట్ అథారిటీ ద్వారా సదరం సర్టిఫికెట్ పొందిన పదర గ్రామానికి చెందిన లక్ష్మీజీ, గుండాల గ్రామానికి చెందిన రాగిచేడు శివకుమార్‌కి అప్పీలేట్ ద్వారా సదరం సర్టిఫికెట్ పొందిన వారికి టీఎస్ ఆర్టీసీ వారి సహకారంతో సదరం సర్టిఫికెట్‌తో పాటు రాయితీ బస్ పాస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో ఏవో నటరాజ్, డీపీఎం వెంకటేశం, సిబ్బంది. సుదర్శన్‌రావ్, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగుకు విశేష స్పందన

- డాక్టర్ శ్యామ్ క్లింటన్

నవ తెలంగాణ - అచ్చంపేట రూరల్

అచ్చంపేట మండలంలోని దేవుళ్ళ తండాలో నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమానికి విశేష స్పందన వచ్చిందని డాక్టర్ శ్యామ్ క్లింటన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం నాడు దేవులతాండలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సభావట్ భారతి ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమంలో 218 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 26 మందికి కంటి అద్దాలు మరియు 11 మందికి కంటి శస్త్ర చికిత్సలో నిమిత్తం రిఫర్ చేయడం జరిగిందని అన్నారు. అంతకుముందు గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమం యొక్క ఉద్దేశము, కంటి సమస్యలపై తీసుకోవలసిన జాగ్రత్తలతో అవగాహన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్ట్ భగత్ సింగ్, అంగన్వాడి సూపర్వైజర్ శాంతమ్మ, ఏఎన్ఎంలు అలివేల, సావిత్రి, పంచాయతీ కార్యదర్శి జాఫర్ లాల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవ తెలంగాణ- వెల్దండ

మండలంలోని నారాయణపూర్ తండాలో ఇటీవల నేనావత్ రాంజ్యా నాయక్ అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం మృతడి కుటుం బానికి శివం యూత్ సభ్యులు రూ. 12వేల ఆర్థిక సహాయం సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో శివం యూత్ సభ్యులు కానిస్టేబుల్ కృష్ణ నాయక్, ఆంజనేయులు, బాణావత్ శ్రీను,బాణావత్ నర్సింహా, బుజంగం, పాత్లావత్ రవి, అంగోత్ లచ్చిరాం, శిరమోని శ్రీను, శిరామోని రమేష్ పాత్లావత్ సంతోష్, సర్పంచ్ అంజ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.



అవెన్యూ ప్లాంటేషన్‌ను సందర్శించిన డీఆర్డీఏ పీడీ



నవతెలంగాణ - తిమ్మాజీపేట

మండల పరిధిలోని నేరెళ్లపల్లి, మారేపల్లి గ్రామాల్లో అవెన్యూప్లాంటేషన్‌ను మంగళవారం డీఆర్డీఏ ప్రాజెక్టుడైరెక్టర్ నర్సింగరావు సందర్శిం చారు. ఆయా గ్రామాల్లో అవెన్యూ ప్లాంటేషన్లో మొక్కల పెంపకం, నర్సరీ లోని మొక్కలను ఆయన పరిశీలించారు. రానున్న వర్షాకాలంలో ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలోను, ప్రధాన రహదారుల సమీపంలో మొక్కలు నాటేందుకు నర్సరీలో మొక్కలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో కరుణశ్రీ, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

ఐకెపీ, వీవోఏల సమస్యలు పరిష్కరించాలి



కందనూలులో..



బిజినేపల్లిలో..

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్ కుమార్

నవతెలంగాణ- కందనూలు

ఐకెపీ వీవోలకు కనీస వేతనం రూ. 26వేలు అమలు చేయాలని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. ఐకెపీ, వీవోఎలా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొల్లాపూర్ చౌరస్తా నుంచి కలెక్టర్ కార్యాలయంవరకు పాదయాత్ర చేసి అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీపీఎం వెంకటేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ.. ఐకెపీ వోఏలకు కనీస వేతనాలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. సీఎం కేసీఆర్ ఎన్నికలకు ముందు వివిధ హామీలిచ్చిన నెరవేర్చడం లేదన్నారు. వారికి కనీస వేతనాలు పెంచడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. మరోవైపు ధరలు ఆకాశాన్ని అందుతుంటే వేతనాలు మాత్రం తక్కువగా ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని ఎన్నో సంవత్సరాల నుంచి పోరాటం చేస్తున్న ప్రభుత్వ మాత్రం ఏమాత్రం స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా తెలంగాణ ప్ర భుత్వం ఐకేపీ, వీవోల హామీనీ వెంటనే నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సీఐ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, జిల్లా ఉపా ధ్యక్షుడు పర్వతాలు, జిల్లా సహాయ కార్యదర్శి పొదిలి రామయ్య, జిల్లా కో-శాధికారి కొంపల్లి అశోక్, ఐకెపీవోఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు సుమలత, ప్రధాన కార్యదర్శి దామోదరచారి, ఉపాధ్యక్షురాలు సుమతి, అంజన్న మహిపాల్, మల్లేష్, నర్సింహ, అనిత, రామస్వామి,అఖిల, తిరుపతమ్మ, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిజినేపల్లి : మండల కేంద్రంలో వీఆర్ఏ సంఘం ఆధ్వర్యంలో మండల తాసిల్దార్ అంజిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. గతంలో ముఖ్యమంత్రి 2017 నుంచి పలు దఫాలుగా వివిధ సందర్భంలో వీఆర్ఏ సమస్యలపై ఎన్నో హామీలు ఇచ్చి నేటికీ ఆ సమస్యలను నెరవేర్చలేదని, పే స్కేల్ అర్హులైన వారికి పదోన్నతులు వారసత్వ ఉద్యోగాలు అమలుకోసం 80 రోజులు సమ్మెచేసిన మునుగోడు ఎలక్షన్ సందర్భంలో వీఆర్ఏలకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కారం చేస్తానని చెప్పి నేటికీ సమస్యను పరిష్కారం చేయలేదన్నారు. ప్రభుత్వంపై మరోసారి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు 48గంటల మౌన దీక్ష కు ఇందిరాపార్క్ దగ్గర చేయడానికి రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందన్నారు. మండల కమిటీల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1న హైదరాబాద్కు వెళ్తున్నామని మండల తాసిల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ సంఘం మండల అధ్యక్షుడు సలేశ్వరం గౌరవ అధ్యక్షుడు సాయి శేఖర్, పాధ్యక్షులు హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులను పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర పరిశీలకురాలు ఉషారాణి



నవతెలంగాణ - కందనూలు

టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా రాష్ట్ర పరిశీలకురాలు మాసబ్ ట్యాంక్ ఐఏఎస్ఈ ప్రిన్సిపల్ ఏ ఉషారాణి అన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల రాష్ట్రస్థాయి పరిశీలకులుగా ఏ. ఉషారాణిని రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సందర్భంగా మంగళవారం జిల్లా డీఈఓ. కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ.. జిల్లా టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి పారదర్శకంగా ఉండాలన్నారు. ఏలాంటి తప్పులకు తావు లేకుండా ఆన్ లైన్ విధానంలో నిర్వహించే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. జిల్లాలో ఉన్న ఉపాధ్యాయులు సీనియారిటీ, ఖాళీల జాబితా ఆన్‌లైన్‌లో ప్రదర్శించిన వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో బదిలీలు పదోన్నతుల ప్రక్రియ ఉండాలన్నారు. అర్హులైన ఏ ఒక్క ఉపాధ్యాయుడికి అన్యాయం జరగకుండా పదోన్నతులు, బదిలీల ప్రక్రియ ఉండాల న్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ ఏజెన్సీ నాన్ ఏజెన్సీ టీచర్ల వివరాలను అడిగి తెలుసు కున్నారు. జిల్లాలో మన ఊరు -మనబడి ప్రారం భోత్సవాలను నిర్వహించే వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఏసీ రాజశేఖ ర్‌రావు, సెక్టోరల్ అధికారి వెంకటయ్య, కార్యాలయ పర్య వేక్షకులు నాగేందర్, సుజాత, సీని యర్ అసిస్టెంట్ రవియాదవ్, సతీష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఆదానీ గ్రూప్ కంపెనీలపై విచారణ జరపాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఏం బాలనరసింహ



నవతెలంగాణ -కందనూలు

జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ లక్ష్మణాచారి భవన్లో మంగళవారం నిర్వహించిన సమావేశానికి సీపీఐ జిల్లా కౌన్సిల్ ముఖ్యఅతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం. బాలనరసింహ హాజరై మాట్లాడారు.. కేంద్రప్రభుత్వం ప్రజా సంస్థలను కాపాడడంలో పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. ప్రభుత్వ సంస్థలైన టువంటి రైల్వే లైన్లను, ఎయిర్ పోర్టులను, బీఎస్ఎన్ఎల్ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు కార్పొరేట్ శక్తులకు నిలువున్న ధారదత్తం చేస్తున్నారని విమర్శిం చారు. అదేవిధంగా ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను కేంద్ర ప్రభుత్వం అమ లు చేయకుండా నల్లధనాన్ని వెలికితీస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశాన్ని ఎలా తాకట్టు పెట్టాలనే ఆలోచిస్తున్నారన్నారు. ఆదానీ గ్రూపు సంస్థల ప్రభుత్వ పెట్టుబడులు ఏ విధంగా పెట్టిందో దేశప్రధాని నరేంద్రదీ వివరణ ఇవ్వా లన్నారు. దివాలా తీసి ప్రజలపై నెట్టాలని చూస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ఆదాని గ్రూప్ కంపెనీలపై సమగ్ర విచారణ చేయాలని ఆయన కేంద్ర, ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యుడు హెచ్ ఆనంద్, వార్ల వెంకటయ్య, ఎస్ఎండీ ఫయాజ్, కే కేశవులుగౌడ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు టి నరసింహ, విజయుడు, యేసయ్య, మహిళ సమాఖ్య జిల్లా ప్రధాన కా ర్యదర్శి ఆర్ ఇందిరమ్మ, కృష్ణాజి, సూర్యశంకర్‌గౌడ్, వెంకటయ్య, బాలమురళికృష్ణ, బోల్లెద్దుల శ్రీనివాసులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్, డీహెచ్‌పీఎస్, జిల్లా ప్రధాన కార్యదర్శి బండి లక్ష్మీపతి, కుతుబుద్దీన్, ఎండీ కాజా, లట్టుపల్లి శ్రీనివాసులు, నాగన్న, పులిజాల పరుశురాములు, గడ్డం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మన ఊరు - మన బడి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- డీఈవో గోవిందరాజులు

నవతెలంగాణ - ఊరుకొండ

మన ఊరు-మన బడి.. బన బస్తీ-మన బడి' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న పనులను త్వరితగతిన పూర్తి ప్రారంభానికి సిద్ధం చేయాలని డీఈవో గోవిందరాజులు అన్నారు. మంగళవారం మండలంలోని రేవల్లి ప్రాథమి పాఠశాలలో రూ.12 లక్షల 32 వేలు, ఉర్కొండ ఉన్నత పాఠశాలలో రూ.57 లక్షల 17 వేల చేపట్టిన డైనింగ్ హాల్, మరుగుదొడ్లు, కాంపౌం డ్‌వాల్ సౌకర్యం, తాగు నీటి ఏర్పాటు, భవనాలకు కలరింగ్, వంటగదుల నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. జిల్లాలో ఫైలట్ ప్రాజెక్టులుగా ఎంపికైన పాఠశాలల్లో అన్నిరకాల పనుల ను పూర్తిచేయాలని అధికారులను ఆదేశిం చారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేందుకు 'మనఊరు-మనబడి, మన బస్తీ-మన బడి' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. పనుల్లో వేగం పెంచా లని, అధికారులు దగ్గరుండి పర్యవేక్షించాలని సూచించారు. ఫిబ్రవరి ఒకటోవ తేదీ నుంచి పాఠశాలలను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్ని వస తులతో ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. ఊరుకొండ ఉన్నత పాఠశాలలో రూ. 5 లక్షల 50 వేలతో 75 ఇంచుల ఎల్‌జీ కంపెనీకి చెందిన డిజిటల్ టీవీని ఆయ న పరిశీలించారు. ఆయన తోపాటు మండల విద్యాధికారి బాసునాయక్, వెంకటేశ్వర్ల శెట్టి, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



తెనుగోల్లును బీసీఏలోకి మార్చాలి



నవతెలంగాణ -కొల్లాపూర్

తెనుగుల సంప్రదాయ మత్స్యకారులను బీసీ-డి నుండి బీసీ ఏలోకి మార్చేందుకు అసెంబ్లీలో ఈ విషయం లేవనెత్తి సీఎం దృష్టికి తీసుకువెళ్లి మాకు న్యాయం చేయించాలని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి తెనుగుల్ల సాంప్రదాయ మత్స్యకారుల రాష్ట్ర సంఘం నాయకులు జలకం మద్దిలేటి మత్స్య శాఖ మాజీ జిల్లా డైరెక్టర్ నక్క బిచ్చన్న ఎల్లూరు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు బిచ్చన్న హరికృష్ణ మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయనతో మాట్లాడుతూ.. దశాబ్దాల కాలంగా నియోజకవర్గ పరిధిలోని సంప్రదాయ మత్స్యకారులు కులవృత్తి నీ నమ్ముకొని జీవిస్తున్నామని తెలిపారు. సురభి వంశస్తుల రాచరికప్పాలనుండి వృత్తిని కొనసాగిస్తున్న ప్రభుత్వం బీసీఏ వన్ సర్టిఫికెట్ ఇవ్వక పోవడంతో విద్య పరంగా ఉద్యోగ రంగా అణిచి వేయబడ్డామని వారికి మేము సామాజికపరంగా వెనక పడ్డామని తెలిపారు. అసెంబ్లీ శేషన్లో మా తెలుగు సాంప్రదాయ మత్స్యకారుల గలాన్ని వినిపించాలని మాకు న్యాయం జరిగే విధంగా చూడాలని వారిని కోరారు. ఈ కార్యక్రమంలో పిట్టల సుధాకర్, రామకృష్ణ, నరేష్, మత్స్యకారులు తదితరులు ఉన్నారు.

అంగన్వాడీ ఉద్యోగుల సమ్మె నోటీస్



నవతెలంగాణ- కల్వకుర్తి టౌన్

అంగన్వాడీ ఉద్యోగులు ఆయాల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఐసీడీఎస్ సీడీపీవోకు సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె నోటీస్ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు మాట్లాడుతూ.. అంగన్వాడీ ఉద్యోగులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని, ఈపీఎఫ్ తదితరసౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఒకటో తేదీ నుంచి మూడవ తేదీ వరకు మూడు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా సమ్మె చేస్తున్నట్లు చెప్పారు. దేశంలో అనేక రాష్ట్రాల లో అంగన్వాడీ ఉద్యోగులకు పింఛన్, ఈపీఎఫ్, హెల్త్‌కార్డు తదితర సౌకర్యాలు ఉన్నాయని, ధనిక రాష్ట్రమని చెప్పుకునే తెలంగాణలో కనీస వేతనాలు అందడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. సమ్మె నోటీస్ ఇచ్చిన వారిలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాసమ్మ, కో-ఆర్డినేటర్ జయమ్మ, కో-శాధికారి పుష్పలీల, స్వప్న, కమల, అలివేలు తదితరులు ఉన్నారు.

ఉపాధి పనులు త్వరగా చేపట్టాలి



నవతెలంగాణ - తిమ్మాజీపేట

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో కూలీలతో త్వరగా పనులు చేపట్టాలని ఎంపీడీవో కరుణశ్రీ పంచాయతీ కార్యదర్శికి ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. మండల పరిధిలోని అవంచ గ్రామంలో మంగళవారం నర్సరీలో మొక్కలను పరిశీలించారు. ఉపాధి హామీ పథకంలో అభివృద్ధి పనులు పనులు చేపట్టాలని ఆమె సూచించారు. అవసరమైన చోట ఉపాధిహామీ పనులు చేయాలని అన్నారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి రవికుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ రవీందర్ ఉన్నారు.

కారు- తుఫాన్ వాహనాలు ఢీ, 8 మందికి గాయాలు



నవతెలంగాణ- పెద్దకొత్తపల్లి

మండల పరిధిలోని ఆదిరాల సమీపంలో కారు -తుఫాన్ వాహనాలు ఎదురెదురుగా ఢీకొనగా 8 మందికి తీవ్ర గాయాలైయ్యాయని, వారిని చికిత్స నిమిత్తం నాగర్ కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించడం గా చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిందినట్లు ఎస్ఐ రాము తెలిపారు. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. కల్వకోల్ నుంచి బయలు దేరిన కారు ఆదిరాల గ్రామం వద్ద ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేయాగా హైదరాబాద్ నుంచి వస్తున్న తుఫాన్ వాహనాన్ని ఢీకొనగా అందులో ప్రయాణిస్తున్న దారా ఈశ్వ రయ్య, దార కల్పన, బండారి చంద్రయ్య, జింకల నిర్మల, నిరంజన మ్మ, కనకం ఉష, నాగేశ్వరిలు తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఏరియా ప్రభుత్వ హాస్పిటల్ తరలించగా చికిత్స పొందుతూ.. బండారి బాలమ్మ అనే మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిందని, మిగతావారు చికిత్స పొందుతున్నారని, తుఫాన్ డ్రైవర్ ప్రవీణ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాము తెలిపారు.

పంచాయతీలో కూలీలు 50 మంది పనిచేయాలి



నవతెలంగాణ -అచ్చంపేట

ప్రతి గ్రామపంచాయతీలో ఉపాధి హామీ కూలీలు 50మంది పని చేయాలని గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి నర్సింగ్‌రావు సుచించారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, సాంకేతిక సహాయకులకు, క్షేత్ర సహాయకులకు జిల్లా ఉపాధి హామీ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడారు.. ప్రభుత్వం సూచించిన విధానం ప్రకారం కూలీలు చేయాలని, లేనిచో కఠిన చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాస్, ఎంపీడీవో మధుసూదన్ గౌడ్, ఏపీఓ పర్వతాలు, ఈసీ భాస్కర్ తదితరులు ఉన్నారు.

తరగతి గది తలుపులు ధ్వంసం

నవ తెలంగాణ- వెల్దండ

మండల పరిధిలోని పెద్దాపూర్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం అర్ధ రాత్రి గురుతుతెలియని దుండగులు రెండు తరగతి గదుల తలుపులు ధ్వంసం చేశారు. మంగళవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులకు విద్యార్థులకు ధ్వంసమైన తరగతి గదులు స్వాగతం పలికాయి. దీంతో పాఠశాల హెచ్ఎం రాజశేఖర్ పోలీసులకు సమాచారం అందజేసి ఫిర్యాదు చేశారు. గత సంవత్సరం సైతం పాఠశాలలో తరగతి గది అలుపులు పగల గొట్టి ఫ్యాన్లు చోరీ చేసినట్లు హెచ్ఎం ఫిర్యాదులో తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

నవ తెలంగాణ- వెల్దండ

మండలంలోని కొట్ర గ్రామానికి చెందిన దేశముని రంగయ్య అనారోగ్యంతో ఇటీవలే మృతి చెందారు. మృతుడి కుటుంబాన్ని కొట్ర సేవా సమితి అధ్యక్షులు పొనుగోటి రవీందర్ రావు మంగళవారం పరామర్శించి ఓదార్చారు. అనంతరం మృతని కుటుంబానికి పోనుగోటి రవీందర్‌రావు 25 కేజీల బియ్యం 9 రకాల నిత్యవసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలోని వార్డు సభ్యులు బుత్కరి మల్లేష్, కొప్పు వెంకటయ్య, భోగరాజు అర్జున్, కడారి వీరేందర్, నరసింహ, సహదేవ్, యాదయ్య ఉన్నారు.

నేడు ధర్నాను విజయవంతం చేయండి

నవతెలంగాణ- ఊట్కూర్

భవన నిర్మాణ కార్మికుల హక్కులకోసం జిల్లా కేంద్రంలోని బుధవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాకు అధిక సంఖ్యలో కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి కనకరాయుడు పిలుపు ఇచ్చారు. మంగళవారం మండలంలోని మల్లెపల్లిలో ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వడ్ల కృష్ణయ్య, మల్లేపల్లి నాయకుడు కిష్టప్ప, బీరప్ప పాల్గొన్నారు.

కంటికి వెలుగు ప్రారంభం



నవ తెలంగాణ -గట్టు

మండల పరిధిలోని అంతం పల్లి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ విజయకుమార్ హాజరై కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ఎంతో మందికి ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరికీ పరిశీలించే బాధ్యత మీదేనని తెలియజేశారు. ఆయనతోపాటు మిట్టదొడ్డి సర్పంచ్, సర్పంచ్ నర్సింహులుగౌడ్, గ్రామస్తులు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

నేడు ఎల్లమ్మ ఉత్సవాలు

నవతెలంగాణ- మరికల్

మండలంలోని ఎల్లిగండ్లలో శ్రీ ఎల్లమ్మ బండారోత్సవాలు బుధవారం ఉదయం 10:30 గంటలకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గ్రామ మాదాసి, మాదారి పొర్లచిన్నబాలప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీరప్ప ఉత్సవాలకు వివిధ మండలాల మాదాసి, మాదారి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

నవ తెలంగాణ- ఊట్కూర్

నారాయణపే ఆర్టీసీడిపో నుండి మక్తల్‌కు వెళ్లే బస్సులు పగిడి మారి, వల్లంపల్లి, ఓబులాపురం, అనిల్ పూర్ సామనూర్, గ్రామాలకు ఊట్కూర్ నుండి మక్తల్‌కు ప్రజల సౌకర్యార్థంకోసం ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించి ప్రజలు సహకరించాలని ఆర్టీసీ డిపోమేనేజర్‌కి జాతీయ కిసాన్ సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చినట్లు మండల కార్యదర్శి మైపాల్‌రెడ్డి మంగళ వారం తెలిపారు. గత నెలలో ఉట్కూరులో ప్రజలకు అందుబాటులో ఆర్టీసీ బస్సు ప్రజలసౌకర్యార్థం ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితంగా ఉంటుం దన్నారు. ప్రజల సౌకర్యార్థం మేలుకోసం సద్వినియోగంచేసి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలని ఉమ్మడి జిల్లా డిపో మేనేజర్ పేటడిపో మేనేజర్ అవగాహన సదస్సు ఏర్పాటుచేసిన సందర్భంగా ఓబులాపురం, పగిడి మారి, అమీదిపూర్ ప్రజల సౌకర్యార్థం నారాయణపేట నుంచి మక్తల్‌కు వెళ్లే బస్సు లను మక్తల్ నుంచి నారాయణపేటకే వచ్చే బస్సులను తమ గ్రామాల ద్వారా నడపాలని ఈ విషయాన్ని వారికి విన్నవించినట్లు గుర్తుచేశారు. వీటికి స్పందించిన పేట డిపోమేనేజరు మాట్లాడుతూ.. ఎనిమిది రోజుల్లో తప్పకుండా పరిశీలించి మీ గ్రామాలకు ప్రయాణికులకోసం తప్పకుండా బస్సు వేసే అవకాశం ఉన్నందున పరిశీలిస్తామని తెలిపారు. వినతిపత్రం ఇచ్చినవారిలో జిల్లా భారతీయ కిసాన్‌సంగ్, రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబ పాల్గొన్నారు.

బహుజన రాజ్యం రావాలంటే బహుజనలో ఏకం కావాలి



నవతెలంగాణ -గట్టు

మండల పరిధిలోని గొర్లఖన్‌దొడ్డిలో మంగళవారం బీఎస్పీ నాయకులు పర్యటించారు. బహుజన సమాజ్ పార్టీ గద్వాల నియోజకవర్గం అధ్యక్షుడు బలిగేరా రాజు, మండల అధ్యక్షుడు వాసు గ్రామాల్లోని పర్యటించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఏకమై బహుజన రాజ్యాన్ని తెచ్చుకుందామని అన్నారు. మనమందరం కలిసికట్టుగా ఉంటేనే బహుజన రాజ్యం వస్తుందని అన్నారు.

విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలి

నవతెలంగాణ -ధరూర్

ఫిబ్రవరి 3 తేదీన జరగబోయే తెలంగాణ రాష్ట్ర శీతాకాల బడ్జెట్లో 30 శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని అన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ పిలుపులో జిల్లా కేంద్రంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు హాలీమ్ పాషా, హరీష్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ మేడిపండువలే తయారైందని స్కూల్‌స్థాయి నుండి యూనివర్సిటీ స్థాయి వరకు మౌలిక సదుపాయాలు టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఎద్దేవా చేశారు. వెంటనే రాష్ట్ర విద్యారంగానికి బడ్జెట్లో30శాతం నిధులు కేటాయించి మౌలికసదుపాయాలు, నూతన భవనాలు, ఫీజు రియంబర్స్మెంట్, మెస్ కాస్మొటిక్ చార్జీలు పెరిగిన ధరలకు అనుగుణంగా చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్ జిల్లా నాయకుల ఈశ్వరు, కరెప్ప తదితరులు పాల్గొన్నారు.

అంగన్ వాడీ భవనం ప్రారంభం

నవతెలంగాణ -మరికల్

మండల కేంద్రంలో నూతనంగా నిర్మాణం పూర్తిచేసిన నూతన అంగన్వాడి భవనాన్ని ఎమ్మెల్యే ఎస్ రాజేందర్ రెడ్డి ప్రారంభించారు. మంగళవారం మండల కేంద్రంలోని పాఠశాల ఆవరణలో అంగన్వాడీ నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భవనానికి రూ. 12 లక్షల 67లు మంజూరు చేసిందని తెలి పారు. అదేవిధంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అదనపు గదులకోసం ఒక కోటరూ. 25 లక్షలతో నూతన భవన నిర్మాణాలకు శంకు స్థాపన చేశారు. అదేవిధంగా మండలంలోని అశోక్‌నగర్ కాలనీలో నూతన బీసీ కమ్యూనిటీహాల్ శంకుస్థాపనచేసి పనులను ప్రారంభించారు. అనం తరం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక మాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమాన్ని మండలంలో ఉన్న ప్రతి గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రామకోటి, ఎంపీడీవో యశోదమ్మ హెడ్మాస్టర్ మనోరంజని, జెడ్పీ వైస్ చైర్మన్ సురేఖ హనిమిరెడ్డి, ఎంపీపీ శ్రీకళ రాజవర్ధన్ రెడ్డి, రవికుమార్ సర్పంచ్ గోవర్ధన్, ఎంపీటీసీ గోపాల్, మత్స్య కార్మిక శాఖ చైర్మన్ కానుగంటి నారాయణ, లంబడి తిరుపతయ్య, రాజమూరు కొండారెడ్డి, రామస్వామి, బసంత్ కుమార్, వెంకటేష్ గౌడ్ జగదీష్, సుధాకర్ గౌడ్, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

నవ తెలంగాణ- ఉండవల్లి

ప్రభుత్వ పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అదనపు క్లాసులతో విద్యా బోధనలు కొనసాగించాలని జిల్లా విద్యాశాఖ అధికారి మహమ్మద్ నిజరుద్దీన్ అన్నారు. మంగళవారం మండలంలోని పదోతరగతి విద్యార్థుల అదనపు తరగతులు బోధనాలను పరిశీలించారు. వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మన ఊరు మనబడి పనులు పురోగతిని పరిశీలించారు. పనులు పూర్తిస్థాయిలో కానందున ప్రారంభానికి నోచుకోలేని పరిస్థితి ఏర్పడిందని వారు తెలిపారు. ఫిబ్రవరి నెలలోనే మన ఊరు మనబడి ప్రారంభించాలని వారు కోరారు. విద్యా కమిటీ చైర్మన్‌లు, శాఖ అధికారులు ప్రత్యేక చోరవ తీసుకొని వీలైనంత త్వరగా పనులు పూర్తిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శివప్రసాద్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

- ఎస్పీ ఎన్ వెంకటేశ్వర్లు



నవతెలంగాణ -నారాయణపేట టౌన్

ఎస్పీ ఎన్ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఆపరేషన్ స్మైల్ ముగింపు సందర్భంగా జిల్లా వ్యాప్తంగా జనవరి ఒకటో తేదీ నుండి 31 వరకు జిల్లాలో 170 మంది బాలకార్మికులను పట్టుకున్నట్లు అందులో 133 మంది బాలురు 37మంది బాలిక లు ఉన్నట్లు తెలిపారు. బాలకార్మికుల ఓనర్లకు రూ. 1, 73,000 వేలు జరిమానా విధించి ఆ యొక్క డబ్బులను బాల కార్మికుల అకౌంట్లో డిపాజిట్ చేసినట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాలకు చెందిన బాలకార్మికులు 56, నేపాల్ కు చెందిన ఒకరిని మొత్తం 57మంది బాలకా ర్మికులను వారి రాష్ట్రాలకు లేబర్ ఆఫీసర్ సాయంతో పంపించినట్లు ఎస్పీ తెలిపారు. మిగిలిన బాలకా ర్మికులను వారి తల్లిదండ్రులను పిలిపించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చి మళ్లీ ఇంకొకసారి బాలకార్మికులుగా పిల్లలను పనిలో పెట్టినచో తల్లిదండ్రులపై కేసులున మో దవుతాయని హెచ్చరించారు. పేట జిల్లాలో మైనర్ బాలలను ఎవరైనా బడి మానిపించి వెట్టిచాకిరి చే యించిన ఆ వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకొ నున్న ట్లు తెలిపారు. 18 సంవత్సరాలలోపు ఉన్న బాలల ను పనిలో ఎవరైనా పెట్టు కుంటే వారిపై కేసులు న మోదు చేస్తామని తెలిపారు. పిల్లల భవిష్యత్ నాశనం చేయొద్దన్నారు. జిల్లాలో బాలకార్మికులు లేకుండా ప్రజలందరూ సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. బాలకార్మికులుగా ఎక్కడైనా చూసినచో డయల్ 1098, 100 కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

అదనపు చార్జీల వసూలును విరమించుకోవాలి



నవ తెలంగాణ - ఊట్కూర్

ఎసీడీ అడిషనల్ కంజెపస్సన్ డిపాజిట్‌పేరుతో విద్యుత్ వినియోగదారులపై అదనపు చార్జీలు వసూలు చేయడం ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఐ ఎంఎల్‌ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి సలీం, ఏఐకేఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణయ్య, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధు, పంథా మండల నాయకులు ఎల్కోటి చెన్నప్ప అన్నారు. మంగళవారం మండలంలోని బిజ్వార్‌లో విద్యుత్ ఉపకేంద్రం ఎదుట సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అడిషనల్ కన్జక్షన్‌బిల్లు, పేరుపై అదనపు డిపా జిట్ చార్జీలను వినియోగదారులపై చార్జీలను వసూలు చేసేందుకు ప్రభుత్వం అడ్వా న్స్‌పేరుతో వినియోగదారుల భారాన్ని మోపుతుందన్నారు. ప్రత్యక్షంగా పరోక్షంగా ప్రజలపై పన్నులు వేయడమేమిటని ప్రశ్నించారు. 24గంటలు ఉచితంగా విద్యుత్ వ్యవసాయానికి అందిస్తామని హామీ ఇచ్చినప్పటికీ నిరంతరాయంగా విద్యుత్ సరఫరా కావడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో ఉన్న 24 లక్షల వ్యవసాయ పంపు సెట్లు విద్యుత్తు సక్రమంగా అందకపోవడం తీవ్ర నష్టా లు గురవు తున్నారు. రాష్ట్ర విద్యుత్ సంస్థ 33వేల కోట్ల బకాయితో కొనసా గుతున్నప్పటికీ ఈ భారాన్ని ప్రజలపై మోపడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. అడిషనల్ కన్జక్షన్ బిల్లును ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాం డ్ చేశారు. సంఘటన స్థలానికి విద్యుత్ శాఖ ఏఈ బాలరాజు హాజరై మాట్లా డుతూ.. డిమాండ్స్‌ను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని, విద్యుత్ సమస్యలు పరిష్క రిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల రైతు సంఘం నాయకులు వై రాజు, పొర్లనరసింహ, తిమ్మప్ప, ఎల్లప్ప, జి అనిల్, సాయప్ప, బాలప్ప, రవి, అంజప్ప రైతులు పాల్గొన్నారు.

గువ్వల బాలరాజు క్షమాపణలు చెప్పాలి

- గువ్వల బాలరాజును బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయాలి
- బీఎస్పీ డిమాండ్

నవతెలంగాణ - కందనూలు

ఎమ్మెల్యే గువ్వల బాలరాజు క్షమాపణ చెప్పాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పసుపుల రామకృష్ణ అన్నారు. మంగళవారం బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో బస్టాండ్ వద్ద ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించి, గువ్వల బాలరాజు దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ అచ్చంపేట్ ఎమ్మెల్యే అధికారం ఉందనే పైత్యంతో, తన స్థాయి మరిచి మాయావతిని విమర్శించడం తగదని అన్నారు. జాతీయ నాయకురాలు మాయావతి ఎంతో త్యాగం, నిబద్ధతతో బహుజన సమాజం కోసం పని చేసిన విషయం మరువొద్దని అన్నారు. మాయావతి పై అవాకులు, చివాక్కులు మాట్లాడుతున్న గువ్వల బాలరాజును బీఆర్ఎస్ నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి కుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం మారిస్తే ఏం అవుతుందని మాట్లాడిన ప్రజల ద్రోహి గువ్వల బాలరాజు అని పేర్కొన్నారు. 2014లో తెరాస ఎన్నికల మేనిఫెస్టోగా దళిత ముఖ్యమంత్రి హామీ ఇస్తే, దళితులకు ముఖ్యమంత్రి పదవి అవసరం లేదని మాట్లాడిన దళితుల ద్రోహి గువ్వల అని విమర్శించారు. నిన్న ప్రెస్ మీట్ లో మేమే అసలైన బడుగు, బలహీన వర్గాల ప్రతినిధులం అని గువ్వల మాట్లాడిన విషయాన్ని గుర్తు చేస్తూ - మీరే అసలైన ప్రతినిధి ఐతే జిల్లా కేంద్రంలో దళితుల భూములు గుంజుకుని మెడికల్ కళాశాల కట్టినప్పుడు మౌనంగా ఎందుకు ఉన్నారని ప్రశ్నించ్చారు. గువ్వల నోరు అదుపులో పెట్టుకోకపోతే, జిల్లాల్లో తిరగనీవ్వబోమని హెచ్చరించారు. 24గంటల్లో గువ్వల బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్ ప్రవీణ్‌కి క్షమాపణలు చెప్పాలని కోరారు. లేని పక్షంలో బీఎస్పీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అచ్చంపేట్ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌ను ముట్టడిస్తామని తెలిపారు. అలాగే బీఎస్పీ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మహిళా జోనల్ ఇన్‌చార్జ్ రాములమ్మ, జిల్లా ఇన్‌చార్జ్ లు బిసమోళ్ల యోసేఫ్, అంతటి నాగన్న, జిల్లా కోశాధికారి కారంగి బ్రహ్మయ్య, జిల్లా కార్యదర్శులు బోనాసి రామచంద్రం, వెంకటేష్ నాయుడు, కేశపాగ వెంకటేష్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కన్వీనర్ విద్యారాణి, అసెంబ్లీల అధ్యక్షులు మొత్కురి నాగార్జున, ఎట్టి ఆంజనేయులు, కదిరేపాడు కృష్ణయ్య, పృథ్వీ రాజ్‌లు, బీఎస్పీ నాయకులు సైదయ్య, చందు, పరుశరామ్, సురేందర్, రాంచందర్, రాజ్, మొగులాల్, బాల నాగులు, వెంకటేష్, దాసు, రామ్, రమేష్, లింగం, మల్లేష్‌లు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్ ఫార్మర్ ధ్వంసం చేసి.. కాపర్ వైర్ చోరీ..

నవతెలంగాణ -వెల్దండ

మండల పరిధిలోని రాఘయిపల్లిలో గుర్తుతెలియని దుండగులు సోమవారం రాత్రి ట్రాన్ ఫార్మర్ ధ్వంసం చేసి అందులోని కాపర్ వైరు చోరీ గురైన పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. రాగాయి పల్లి గ్రామపంచాయతీకి నీటిని సరఫరా చేస్తే బోరు మోటర్లకు సంబంధించిన ట్రాన్స్ ఫార్మర్‌ను ధ్వంసమై చోరీకి గురైనట్లు గుర్తించిన గ్రామస్తులు గ్రామ సర్పంచ్‌కి సమాచారం అందజేశారు. గుర్తుతెలియని దొంగలు అర్ధరాత్రి సమయంలో ధ్వంసం చేసి అందులోని కాపర్ వైరు ను దొంగిలించినట్టు గుర్తించారు.గ్రామ సర్పంచ్ విద్యుత్ అధికారులకు , పోలీసులు సమాచారం అందజేసి ఫిర్యాదు అందించారు. చోరిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.



విద్యార్థులకు చట్టాలపై అవగాహన

నవతెలంగాణ- గట్టు

మండలంలోని మాచర్లలో మంగళవారం జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల ఎంపీపీవిజయ్‌కుమార్ హాజరై మాట్లాడారు.. బాలల హక్కులు కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషిచేయాలని, గ్రామంలో బాల్యవివాహాలు జరగకుండా ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. 18సంవత్సరాలోపు అమ్మా యిలకు, 21 సంవత్సరాలకు అబ్బాయిలకు పెళ్లి చేయడం చట్టరీత్యానేరం అం దుకు రూ. లక్షా జరిమానా రెండు సంవత్సరాల జైలుశిక్ష ఉంటుందని తెలియ జేశారు. పిల్లలతో పని చేయించడం తప్పని వారిని బడికి పంపించాలని చదు వు నేర్చుకోవడంతో మంచి భవిష్యత్ పిల్లలకు ఉంటుందని పిల్లలందరూ బడికి వెళ్లాలని తోటి వి ద్యార్థులు ఎవరన్నా బడికి రానట్లయితే వారికి తెలియ జేసి ప్రతిరోజూ పాఠశాలకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలోని బాలరక్ష భవ న్ కో-ఆర్డినేటర్ హేమలత, సీడీపీవో కమలాదేవి, బాలల సంరక్షణ అధికా రి, భాస్కర్, పంచాయతీ కార్యదర్శి, ప్రదీప్, స్కూల్ హెచ్ఎం నర్సింహులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



లారీ డ్రైవర్ నిర్లక్ష్యం.. 24 గొర్రెలు మృతి

నవ తెలంగాణ -కృష్ణ

లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో 24 గొర్రెలు లారీ ఢీకొని మృత్యువాత పడ్డాయి. మండలంలోని గుడెబల్లూర్ గ్రామ జాతీయ రహదారిపై జరిగిన దుర్ఘటన కర్ని గ్రామ కుర్వ కరినింగప్ప, శివరాజ్, నరేష్ మక్తల్ మండలం నుంచి కర్ణాటకకు మేప టానికి వెళ్తున్న గొర్లపై అచ్చంపేట నుంచి కర్ణాటక వెళ్తున్న లారీ ఫైరోడ్డు వద్ద స్పీడ్‌గా వచ్చిన లారీ గొర్లపైకి దూసుకువెళ్లి 24 గొర్లు అక్కడికక్కడే మృతిచెందాయి.. పక్కనే ఉన్న స్థానికులు లారీని ఆపి అదుపులోకి తీసుకున్నారు. పెద్ద ఎత్తున గొర్రెలు మృతి చెందడంతో గొర్ల కాపరి లబోదిబోయినమంటూ విల్లపిస్తున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న జిల్లా గొర్ల సహకార సంఘాల అధ్యక్షుడు నాగరాజు, శ్రీను పంతులు రాష్ట్ర కుర్వ సంఘం ఉపాధ్యక్షుడు, మండల అధ్యక్షుడు మహాలింగా, నర్సింహులు, నాయకులు, బీరప్ప, నర్సింహులు కాపరికి పరా మర్శించారు. దాదాపు రూ. 5 లక్షలు వాటిల్లినట్లు పేర్కొన్నారు.



ఆకట్టుకున్న రావేప్ విద్యార్థుల ప్రదర్శన

నవతెలంగాణ - తిమ్మాజీపేట

కెవికె పాలెం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయంలో సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థులు సౌజన్య అనురాధ, పావని, స్నేహ, రమ్య, నిహారిక, రిజ్వాన, లావణ్య, సాత్విక కలిసి పంచాయతీ ఆవరణలో గ్రామీణ విశ్లేషణాత్మకను తమ రావేప్‌లో భాగంగా నిర్వహించారు. వీటి ముఖ్య ఉద్దేశం ప్రజల్లో సామాజిక బాధ్యత, స్పృహ కలి గించడం అని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామ చిత్రపటం వేసి ఏ ప్రదేశం ఎక్కడ ఉన్నది వాటి ఉపయోగాలను తెలుపుతూ గ్రామానికి ఉపయోగపడే వనరులను ఇతర అంశాలను ప్రజాప్రతినిధులకు రైతులకు వివరించారు. అలాగే ఇతర చిత్రపటాల ద్వారా గ్రామ ప్రజలకు ఉన్న సమస్యలను చెబుతూ వాటి నివారణ మార్గాలను సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ దయాకర్ రెడ్డి, సర్పంచ్ అజయ్‌కుమార్, కెవికె కోఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి కమల్ కుమార్, ఏఈవో సాయిరాం ఉపాధ్యాయులు అంగన్వాడి టీచర్లు విద్యార్థులు రైతులు సురేందర్ రెడ్డి జంగయ్య మాధవులు తదితరులు ఉన్నారు.



మధ్యాహ్న భోజనం పరిశీలన



నవ తెలంగాణ- గట్టు

మండల పరిధిలోని మాచర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం ఆకస్మాత్తుగా మధ్యాహ్న భోజనాన్ని ఎంపీపీ విజయ్ కుమార్ పరిశీలించారు. భోజనం చేశారు అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అదేవిధంగా ప్రధానోపాధ్యాయుడు నర్సింహులుతోపాటు మధ్యాహ్నం భోజనం వర్కర్లతో ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజూ మెనూప్రకారం వడ్డించాలని తెలియజేశారు. అనంతరం విద్యార్థులను భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు తుమ్మలపల్లిసర్పంచ్ చెన్నారాయుడు, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ, జములమ్మ జాతర

నవ తెలంగాణ- ఊట్కూర్

మండలంలో మంగళవారం ఎల్లమ్మ, జములమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా గుడి పూజారులు మొదటి బోనం శంకర్‌గౌడ్ ఇంటి నుంచి ప్రారంభమైంది. ఎల్లమ్మకు, జములమ్మకు ప్రత్యేక పూజలు చేసి అనంతరం గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని బోనాలతో ఆలయం చుట్టూ తిరిగి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్‌గౌడ్, రాముగౌడ్, జగదీష్ గౌడ్, నరహరిగౌడ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరించిన ఎమ్మెల్యే అబ్రహం



నవతెలంగాణ -ఉండవెల్లి

దళితులు ఆర్థికంగా బలోపేతమైనప్పుడే కుల నిర్మాణ సాధ్యమవుతుందని స్థానిక ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. మంగళవారం అలంపూర్ చౌరస్తాలో ఎమ్మెల్యే క్యాంప్‌లో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం నూతన డైరీ ఆవిష్కరణ ఆవిష్కరించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ముద్రించిన డైరీలో ఆర్టికల్స్ పొందుపర్చడం ద్వారా ఉపయోగపడుతుందని వారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటస్వామి, కేవీఎస్ నాయకులు, ఎమ్మెల్యే అబ్రహంను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రాజు, పరంజ్యోతి, విజయ్‌కుమార్, మహేష్, ప్రభాకర్, రాజు, మద్దిలేటి నాగరాజు సీఐటీయూ నాయకులు వెంకటేశ్, మాలిక్కు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలి



నవతెలంగణ -ధరూర్

అర్హులైన వారందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సిఐటీయు జిల్లా కార్యదర్శి వివి నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణ కేంద్రంలోని చింతలపేట, మద్రాస్‌పేటలో అర్హులైన వారికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సర్వే నిర్వహించినట్లు తెలిపారు. దీంతోపాటు ఇండ్ల స్థలం ఉన్న రూ. 5 లక్షలు ఇవ్వాలని అన్నారు. ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం చేసి ఇవ్వాలని అన్నారు. అలాగే ఫిబ్రవరి 9న హైదరాబాద్ ఇంద్ర పార్క్ వద్ద ఇండ్లు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని పెద్దఎత్తున ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ గజేంద్ర, రాము, శీను తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ- బిజినేపల్లి

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అతితక్కువ వేతనంతో పనిచేస్తున్న ఆశావర్కర్లకు కనీస వేతనం రూ. 26వేలు అమలు చేయాలని, ఉద్యోగభద్రత, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాల ని ఆశావర్కర్ల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించాలని ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డికి జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నమ్మ ఆధ్వర్యంలో వెలుగొండలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నమ్మ.. మాట్లాడుతూ వైద్యఆరోగ్యశాఖలో అన్నిరంగాల కార్మికులతో సమానంగా పనిచేస్తున్న ఆశవర్కర్లకు రూ. 26 వేలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 16న చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశవర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

యువతకు క్రికెట్ కిట్ పంపిణీ

నవతెలంగాణ -కల్వకుర్తి

కల్వకుర్తి మునిసిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డు ఈదమ్మ తల్లి యూత్ అసోసియేషన్ సభ్యులకు మంగళవారం ఐక్యత ఫౌండేషన్ నిర్వాకులు క్రికెట్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు వరప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో యువత క్రీడలపై దృష్టి సారించే విధంగా క్రీడా సామాగ్రి పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో యువతకు ఐక్యత ఫౌండేషన్ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు ఫౌండేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దూడలకు బ్రు సెల్లా టీకాలు

నవతెలంగాణ - తిమ్మాజీపేట

మండలంలోని ఏదేరేపల్లి మాన్య నాయక్ తండా లో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నాలుగు నుంచి 8 నెలలు వయసున్న ఆవు గేదెల దూడలకు బ్రూసెల్ల టీకాలను వేశారు 2 గ్రామాల్లో మొత్తం 32 దూడలకు టీకాలు వేసినట్లు వైశువైద్యాధికారి శ్రావణి తెలిపారు. ఈ టీకా వేయడంతో చూడి సమయంలో పిండం ఈడ్చుకుపోకుండా కాపాడుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది శ్రీనివాసులు, తిరుపతయ్య గోపాలమిత్రలు స్వామి, జీవన్ మరియు రైతులు పాల్గొన్నారు.